# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త



సోమవారం 24 మార్చి 2025


### మెలకువలు పాటించడం ద్వారా

## కిక్ బాక్సింగ్ లో రాణించవచ్చు

**బద్వేల్ అర్బన్ మార్చి 23 ప్రభాతవార్త**

ఏ రంగంలో అయినా మెలకువలు పాటించడం ద్వారా రాణించగలరని టిడిపి నాయకులు కొంకుల రాంబాబు పేర్కొన్నారు. బద్వేలు పట్టణంలోని ఏ వి ఆర్ స్కూల్ ఆవరణంలో స్పోర్ట్స్ క్లబ్ వారి వాకో ఇంటర్ డిస్ట్రిక్ట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ 2025 అభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ మున్సిపల్ మాజఅధ్యక్షులు కొంకుల రాంబాబు వాకో సంస్థ ప్రెసిడెంట్ ఎస్.కె వసీమ్, సెక్రటరీ జె వెంకటసుబ్బయ్య, పాల్గొని జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి విద్యార్థినీలు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలన్నారు, క్రీడారంగంలో కిక్‌బాక్సింగ్ అనేది అనేక సాంప్రదాయ పోరాట క్రీడలు మరియు యుద్ధ కళల ఆధారంగా సృష్టించబడిన ఆధునిక కాంటాక్ట్ ఫైటింగ్ క్రీడ. కిక్‌బాక్సింగ్ అనేది అనేక తూర్పు యుద్ధ కళలకు ఒక ప్రత్యేకమైన పాశ్చాత్య ప్రతిస్పందన. కిక్‌బాక్సర్ యొక్క ఆకాంక్షలను బట్టి దీనిని పోటీ లేదా వినోద స్థాయిలో అభ్యసించవచ్చు, కానీ ఖచ్చితంగా ఇది మీ మొత్తం ఆరోగ్యం, బలం మరియు ఓర్పును మెరుగుపరచడానికి రూపొందించబడిన క్రీడ అని అన్నారు రేపు నెల కల్లూరులో జరగబోయే ఐదు ఆరు తారీకులలో జాతీయస్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ట్రెజరర్ సురేష్‌బాబు ఏవిఆర్ స్కూల్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ ,తెలుగు యువత నాయకులు కుంకుల రవికుమార్, బ్రహ్మయ్య, తిరుమల కొండయ్య, మస్తాన్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఆర్ఐఎంసి 2024 ఎంట్రన్స్ పరీక్షలో జిల్లా విద్యార్థి ఎంపిక

**బ్రహ్మంగారిమఠం, మార్చి 23 ప్రభాతవార్త**



సౌత్ జోన్ పరిధిలో వున్న తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల నందు నిర్వహించిన రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ (ఆర్.ఐ.ఎం.సి.) 2024 లో ఆరు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్షలో కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం,బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు ముంపుప్రాంతమైన, కొత్త ఓబులరాజు పల్లె గ్రామానికి చెందిన శ్రీయపు రెడ్డి వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మి దంపతుల కుమార్తె సరయురెడ్డి అనే 7వ తరగతి చదువుకునే తమ కూతురు ఎంపికైనట్లు వారి తల్లిదండ్రులు తెలిపారు. హైదరాబాదులోని వైయాసిస్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు ఏడో తరగతి చదువుకుంటూ కోరుకొండ కోచింగ్ సెంటర్ లో కోచింగ్ తీసుకుంటూ సౌత్ జోన్ 2024 ఎంట్రన్స్ పరీక్షలో ఏకైక విద్యార్థి ఎంపిక కావడం వర్తించదగ్గ విషయమని మండలవాసులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

# వన్య మృగ సంరక్షణ చట్టాలెక్కడ..?

- తాజాగా కుక్కల దాడిలో గాయపడ్డ జింక..!
- నీటి కుంటలు కరవై గ్రామాల్లోకి వస్తున్న వన్యమృగాలు
- అడవిని వదిలే ఏనుగులతో అటవీ సమీప గ్రామ పొలాలకు కరవవుతున్న రక్షణ
- ప్రకటనలకే పరిమితమవుతున్న అటవీ ప్రాంతంలో నీటి కుంటల ఏర్పాటు హామీ..

**అన్నమయ్య జిల్లాలో అడవిని వదిలి తరచూ జనవాసాల్లోకి వన్యమృగాలు రావడం పరిపాటిగా మారుతోంది.. జనవాసాల్లోకి రాకుండా అటవీ ప్రాంతంలో నీటి కుంటల ఏర్పాటు అత్యవసరం.. వన్యప్రాణుల సంరక్షణకు కట్టుబడి ఉన్నట్టు ప్రభుత్వం ఒకప్రక్క చెపుతుంది.. మరో ప్రక్క ఎన్నో చట్టాలున్నా కార్యరూపంలో అమలుకు నోచుకోవడం లేదు.. దీంతో రోజురోజుకు వన్యమృగాలకు రక్షణ కరవవుతోంది.. జిల్లాలోని అటవీప్రాంతంలో వన్యప్రాణులను వేటాడే వేటగాళ్ల ఆటలు కట్టించాలి.. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎర్రచందనం వృక్ష సంపదను దోచుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి.. ఇందుకు ఆధునిక నిఘా వ్యవస్థ అత్యవసరంగా కనిపిస్తోంది..**

**(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)**

అన్నమయ్య జిల్లా నందలూరులో మరో జింక కుక్కల దాడిలో గాయపడింది. అటవీ ప్రాంతంలో నీటి వసతులు కరవైనందునే వన్యప్రాణులు జనవాసాల్లోకి వస్తుండడం జరుగుతోంది. వన్య ప్రాణుల సంరక్షణ కోసం భారత పార్లమెంటు మొక్కలు, జంతు జాతుల రక్షణ 1972 రూపొందించింది. ముందు భారతదేశంలో కేవలం 5 జాతీయ పార్కులు మాత్రమే ఉన్నాయి. మొక్కలు, జంతు జాతుల రక్షణ చట్టం రూపొందించిన తరువాత రక్షిత మొక్కలు కొన్నింటిని చట్టం షెడ్యూల్‌లో చేర్చడంతో పాటు కొన్ని జంతు జాతులను వేటాడడం, ఈ జాతులను చంపి తినడం చట్ట విరుద్ధం. ఈ చట్టం అటవీ జంతువులు, పక్షులు, మొక్కలు వివిధ స్థాయిల్లో రక్షణను అందించే 6 షెడ్యూల్స్‌ను కలిగి ఉంది. షెడ్యూల్ 1, 2లలో జంతు జాతులకు, మొక్కలకు పూర్తిస్థాయి రక్షణ ఇచ్చేలా చట్టాన్ని రూపొందించారు. వీటి క్రింద నేరాలకు అత్యధిక జరిమానాలు విధించారు. షెడ్యూల్ 3,4 లలో గుర్తించిన కొన్ని జాతులు రక్షించబడతాయి. అ యితే జరిమానాలు తక్కువగా ఉంటాయి. షెడ్యూల్ 5 క్రింద ఉదాహరణకు కాకులు, గబ్బిలాలు, ఎలు కలు తదితర వాటిని స్వేచ్ఛగా వేటాడవచ్చు. షెడ్యూల్ 6లో పేర్కొన్న మొక్కలను సాగు చేయడం, నాట డం, పూర్తిగా నిషేదించబడింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఈ షెడ్యూల్స్‌లో చేసిన చట్టం ప్రకారం నేరాలను సమ్మిళితం చేసే అధికారం కలిగి ఉంటుందని తెలుస్తోంది. వన్య ప్రాణులతో పాటు అడవుల్లోని కొన్ని వృక్షజాతులను సంరక్షించేందుకు చట్టాలున్నా ఈ చట్టాలు అనేక సందర్భాల్లో కనిపించని పరిస్థి తులున్నాయి. దేశంలోనే పేరుమోసిన సినిమానటులు సైతం వన్యమృగ మాంసాన్ని భక్షించినందుకు ఈ చట్టాల ద్వారా శిక్షించబడిన విషయం తెలిసిందే. అయితే స్థానికంగా అటవీ అధికారులు ఈ చట్టాలను అమలు చేయడంలో చూపుతున్న నిర్లక్ష్యం వేటగాళ్ల పాలిట వరంగా మారుతోందన్న విమర్శలు వినిపి స్తున్నాయి. దీంతో ఇష్టారాజ్యంగా వన్యమృగాలను అన్నమయ్య జిల్లాలోని అటవీ ప్రాంతంలో వేటాడు తున్నట్టు ఆరోపణలున్నాయి. తాజాగా ఓ అడవి జింక అడవి నుండి త్రాగునీటి కోసం మరెందుకో బయ టకు వచ్చి నందలూరు బైపాస్ రోడ్డు ప్రక్కనున్న పొలాల వద్ద కుక్కల దాడిలో గాయపడింది. స్థానికులు గమనించి జింకను కాపాడి పోలీసులకు సమాచారం అందజేయడం జరిగింది. గతంలో కూడా నందలూరు మండలంలోని కన్యకచెరువులో నీరు త్రాగుతుండగా కుక్కల దాడిలో ఓ జింక గాయపడింది. అదృష్ట వశాత్తు కన్యకచెరువు సమీపంలో రైల్లో వెళుతున్న ప్రయాణీకులు ఇది గమనించి అందించిన సమాచా రంతో స్థానికంగా ఉండే యువకులు గాయపడిన



అన్నమయ్య జిల్లా నందలూరు బైపాస్‌రోడ్డు ప్రక్కన వరి పొలాల్లో కుక్కల దాడిలో గాయపడ్డ జింక

జింకను కన్యకచెరువు నీటి నుండి బయటకు తీసి అటవీ శాఖాధికారులకు అందించడం జరిగింది. అడవుల్లో త్రాగునీరు కరవవ్వడం వల్లే జింకలు తరచూ జన వాసాల వైపుకు వచ్చి ప్రమాదంలో చిక్కుకుంటున్నాయి. ప్రజాప్రతినిధులు గతంలో ఇచ్చిన హామీల మేర కు అటవీ ప్రాంతంలో వన్యమృగాల కోసం నీటి కుంటలను ఏర్పాటు చేసి ఉంటే అడవిని వదలి బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. అడవుల్లో నీటి కుంటలను ఏర్పాటు చేయడం వల్ల ఒకోమారు క్రూర జంతువులైన చిరుతలు, హైనాలతో పాటు ఏనుగులు లాంటివి కూడా అడవిని వదలి సమీప గ్రామాల్లోకి వచ్చే పరిస్థి తులు తప్పుతాయి. ఏనుగులు అటవీ సమీప గ్రామాల్లోకి రావడమే కాకుండా పంట తోటలను ధ్వంసం చేయడం, ఒకోమారు రైతులు ఏనుగుల దాడిలో గాయపడడం, మరణించడం కూడా జరుగుతోంది. ఇటీవలే రాజంపేట అటవీ డివిజన్‌లో గుండాలకోన సమీపంలో ఏనుగుల దాడిలో ముగ్గురు భక్తులు మహా శివరాత్రి ముందు మృతి చెందిన విషయం తెలిసింతే. అంతే కాకుండా అడవిని వదలి వన్యప్రాణులు బ యటకు రాకుంటే వేటగాళ్లకు చిక్కే పరిస్థితులు చాలావరకు తప్పుతాయి. కనుక అటవీ ప్రాంతంలో అవసరమైన చోట కంచెలు ఏర్పాటు చేయడం, నీటి కుంటలను ఏర్పాటు చేయడం వల్ల అటవీ సమీప గ్రామాల ప్రజలు ఎదుర్కొనే అనేక సమస్యలు పరిష్కారమవుతాయి. వన్యమృగ సంరక్షణకు చట్టాలున్నా అమలులో లోపిస్తున్న చిత్తశుద్ధి కారణంగా వన్యమృగాలకు రక్షణ కరవవుతున్నట్లు ఆరోపణలున్నాయి. దట్టమైన అడవులు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎర్రచందనం వృక్షాలకు, ఔషధమొక్కలకు నిలయంగా ఉన్న అన్నమయ్య జిల్లాలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు కొదవలేదు. ఇక్కడ చిరుతలు, ఏను గులు, జింకలు, దుప్పిలు, కుందేళ్లు, కొండగొర్రెలు, కణితలు తదితర వన్యమృగాలున్నాయి. ఈ అటవీ ప్రాంతంలో కొంతమంది నిత్యం వన్యమృగ వేట కొనసాగిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ జిల్లాలోని పెనగలూరు మండలంలో గతంలో వన్యప్రాణుల కోసం నీటి కుంటల వద్ద కాపుకాచి అలికిడి కావడంతో వేటగాళ్లు పేల్చిన తుపాకి తూటాలు ఇద్దరి దళితులకు తగలడంతో వారిలో ఒకరు మృతి చెందిన సంఘట నలు ఉన్నాయి. అటవీ సమీప గ్రామాల్లో వన్యమృగాల మాంసం కూడా లభిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. అన్ని రకాల అటవీ సమీప గ్రామాల్లో పంట పొలాలను సంరక్షించుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్తు వైర్లు నాటడం చేస్తుంటారు. ఈ విద్యుత్తు వైర్లు తగిలి ముఖ్యంగా అడవి పందుల మొదలు వన్యమృగాలు మరణిస్తుండడం జరుగుతోంది. దీనికి తోడు రోజురోజుకు స్మగ్లర్లు కారణంగా అడవులు తగ్గిపోతుండడం కూడా వన్యప్రాణులకు రక్షణ కరవయ్యేలా చేస్తుంది. అటవీ సంరక్షణ చట్టాలు

### అకాల వర్షానికి

# అన్నదాత కలావికలం

2300 ఎకరాల్లో దెబ్బ తిన్న అరటి పంట

ఇరవై కోట్ల రూపాయలు నష్టం

ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం అంటున్న రైతన్నలు



లింగాల మండలంలో దెబ్బ తిన్న అరటి పంట

**పులివెందుల ,మార్చి 23, ప్రభాత వార్త:**

ఈ ఏడాదైనా చేతినిండా రాబడి వచ్చి రుణ విముక్తులమవుతామని సాగుచేసి కోటి ఆశలతో ఎదురు చూస్తూ నేడు రేపో పంట కోత కోస్తా మని భావించిన అరటి రైతన్నలకు అకాల వర్షం గాలుల రూపంలో వారి ఆశలు అన్నిఅడియాశలు అయ్యాయి. పంట సాగు చేసే టందుకు పెట్టుబడి లేకపోయినా లక్షల రూపాయలు రుణాలు చేసి అరటి పంట సాగు చేస్తే రైతన్నలకు అకాల వర్షం కన్నీళ్లు మిగిల్చింది. పులివెందుల నియోజకవర్గంలోని ఒక్క లింగాల మండలంలోని శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి గాలులకు 2300 ఎకరాలలో సాగుచేసిన అరటి పంట నేలకొరిగింది. దీనితో దాదాపు 23 కోట్ల రూపాయలు నష్టం వాటిల్లింది. దీనితో రైతన్నలు సాగుచేసిన పంట నేలకొరవడం చూసి లబోదిబోమంటున్నారు. ఈ ఏడాదైనా చేసిన అప్పుల నుంచి బయటపడదామ నుకుంటే చేతికి వచ్చే సమయంలో పంట అంతా నీళ్ల పాల్లవడంతో రైతన్నల బాధ వర్ణనాతీతంగా మారింది. ప్రభుత్వం ఆదు కోకపోతే ఇక ఆత్మహత్యలే మాకు శరణ్యమని రైతన్నలు వారి విచారాన్ని వ్యక్తం చేస్తున్నారు. రైతన్నలను ప్రభుత్వం ఆదుకోకపోతే వారి కుటుంబాల మనుగడకే ముప్పు వాటిల్లే అవకాశం ఉందని కావున దెబ్బతిన్న పంటల నష్టానికి నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందచేసి రైతన్నలను ఆదుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుకుంటున్నారు.

**23 కోట్ల పంట నష్టం : ఆర్టికల్చర్ అధికారి రాఘవేందర్ రెడ్డి..**

పులివెందుల నియోజకవర్గంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి లింగాల మండలంలో ఎక్కువ నష్టం వాటిల్లినట్లు హార్టికల్చర్ అధికారి రాఘవేందర్ రెడ్డి అన్నారు. వార్త ప్రతినిధితో ఆర్టికల్చర్ అధికారి రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు అందిన సమాచారం మేరకు లింగాల మండలంలోని ఎక్కువ నష్టం వాటిలిందనీ, మండల పరిధిలో మొత్తం తొమ్మిది వేల మూడు వందల ఎకరాలు అరటి పంట సాగు చేస్తే అందులో 2300 ఎకరాలు అరటి పంట దెబ్బతినిందన్నారు. దీనితో దాదాపు 20 కోట్ల రూపాయలు పంట నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ఇంకా దెబ్బతిన్న పంటల వివరాలు తెలియాల్సి ఉందన్నారు రెండు మూడు రోజుల్లో పూర్తి నివేదికలో తయారుచేసి ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు.

## విజయశేఖర్ రెడ్డికి మాజీ సిఎం వైఎస్ జగన్ నివాళులు

**పులివెందుల, మార్చి 23,ప్రభాత వార్త:**

వైఎస్ మనోహర్ రెడ్డి మేనల్లుడు మరియు కీ. శే. సి.వి సుబ్బారెడ్డి కుమారుడు అయిన ప్రముఖ పారిశ్రామిక వేత్త చవ్వా విజయ శేఖర్ రెడ్డి ( దుష్యంత్ రెడ్డి తండ్రి) కి ఆదివారం సాయంత్రం మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ,ఆయన సతీమణి వైఎస్ భారతి ఘన నివాళులు అర్పించారు. శనివారం చవ్వ విజయ శేఖర్ రెడ్డి ఛాతీ నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురై తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. దీనితో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హుటా హుటిన పులివెందులకు చేరుకున్నారు. పట్టణంలోని సీవీ సుబ్బారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి విజయ్ శేఖర్ రెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా దుష్యంత రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆది, సోమవారం పులివెందుల లోనే వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉండనున్నట్లు సమాచారం. నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు సమాచారం. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందులకు వచ్చాడన్న విషయం తెలుసుకున్న వైకాపా నాయకులు కార్యకర్తలు ఆయనను కలవడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఆయన అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# సతీష్‌ను సొంత కొడుకులాగా చూసుకున్న చంద్రబాబు

**ముప్పై వేలు ఉన్న మెజార్టీనీ లక్షపైగా పెంచిన సతీష్ రెడ్డి**

**అధికారంలో ఒక మాట ప్రతిపక్షంలో మరో మాట**

**ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధం**

**శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి**

**పులివెందుల,మార్చి 23 ,ప్రభాత వార్త :**

నియోజకవర్గంలోనీ ఎస్ వి సతీష్ కుమార్ రెడ్డిని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు సొంత కొడుకు లాగా చూసు కున్నారని కానీ నేడు చంద్రబాబు నాయుడు మోసగాడు అంటూ విమర్శించడం సతీష్ రెడ్డికి తగదని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త బిచ్చగాడు పొద్దు ఎరుగునట్లు సతీష్ రెడ్డి వ్యవహరిస్తు న్నారని 1998లో మండల పరిషత్ అధ్యక్షుడుగా ఎన్నికైనప్పటి నుంచి 2019 వరకు మంచిగా ఉన్న చంద్రబాబు నాయుడు ,లోకేష్ లు నేడు చెడ్డవారయ్యారని, తప్పుడు కేసులు పెట్టి వేధించిన జగన్మోహన్ రెడ్డి వైఎస్ కుటుంబ సభ్యులు నేడు మంచోళ్ళు అయ్యారని ప్రశ్నించారు. 2005 అక్టోబర్ 18 వ తేదీన వేల్పుల లో జరిగిన సహకార ఎన్నికల్లో మీ గన్మెన్ వెంకటేష్ కాల్పులు జరిపితే ఇద్దరు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చనిపోయారని అప్పుడు 16 మంది పైన కేసు పెట్టడం జరిగిందని ఇప్పటికీ ఆ కేసు జరుగుతూనే ఉందన్నారు. అప్పట్లో మా ఆస్తుపాస్తులను కూడా ధ్వంసం చేయడమే కాకుండా పోలీసులు ఇష్టం వచ్చిన రీతిలో కొట్టారని నీకోసం ఆస్తిపాస్తులు పోగొట్టుకుని మేము చావు దెబ్బలు తిన్నామన్నారు. 1999 కి ముందు నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ముప్పై వేల మెజార్టీ మాత్రమే ఉండిందని నీకు అసెంబ్లీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చినప్పటి నుంచి ఆ మెజార్టీని లక్షకు పెంచావ న్నారు. నియోజవర్గ విభజన జరిగితే వేంపల్లి నియోజకవర్గంగా అవుతుందని అప్పుడు ఎమ్మెల్యే సీట్ ఇస్తారన్న దూరపు ఆలోచనతో చంద్రబాబును లోకేష్ ను మంచివారు కాదంటూ దూషించడం స్నేహం చేస్తే జగన్మోహన్ రెడ్డితో చేయాలని అనడం నీ స్వార్థ రాజకీయానికి నిదర్శనం అన్నారు. దాదాపు 28 సంవత్సరాలు నీ వెంట ఉండి ఆస్తి పాస్తులను పోగొట్టుకోవడం కాకుండా శారీరక హింస గురయ్యామని ఏ రోజు ఎలక్షన్ జరిగిన ఆరోగ్యం బాగా లేదంటూ ఏసు రూములో కూర్చుని నీవుంటే నిన్ను గెలిపించేందుకు మేము అష్ట కష్టాలు పడే వారమన్నారు. ఏనాడు కౌంటింగ్ కేంద్రానికి సతీష్ రెడ్డి నువ్వు ఏ రోజైనా వెళ్లేవా అని ప్రశ్నించారు. పార్టీని విపేదించి వేరే పార్టీకి వెళ్లడం వ్యక్తిగతమనీ, కావాలంటే మీ పార్టీ సిద్ధాంతాల గురించి చెప్పుకొవాలి అని కానీ అన్నం పెట్టిన తెలుగుదేశం పార్టీని దూషించి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టొద్ద న్నారు. వేంపల్లి లో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఏనాడైనా సమస్య పరిష్కారానికి గాని కనీసం కలెక్టర్ దృష్టికి కానీ తీసుకెళ్లావా అంటూ ప్రశ్నించారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో నీ ఇంటి నుంచి పోటీ చేసి మీ సత్తా ఏంటో చూపించాలన్నారు. ఇప్పటికైనా సతీష్ రెడ్డి ఇష్టానుసారం మాట్లాడడం మానుకోవాలన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కడప మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి ఇష్టానుసారంగా మాట్లా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

డడం మానుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రమే రాయలసీమ గుర్తుకొస్తుందని ప్రశ్నించారు. మీ ఐదు సంవత్సరాల పాలనలో రాయలసీమకు ఒరిగిందేమీ లేదన్నారు. పోలవరం ఎత్తు గతంలో ఏ మేరకు ఆమోదం ఉందో అంత మేర కడుతున్నామని చెబుతున్న పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్లో ఏమో జరుగుతోంది అన్నట్టుగా పోలవరం ఎత్తు తగ్గిస్తున్నారని అవాస్తవాలు మాట్లాడడం తగదన్నారు. తెలంగాణలో కెసిఆర్, ఆంధ్ర రాష్ట్రంలో జగన్ పాలనలో ఉన్న సమయంలోనే పాలమూరు రంగారెడ్డి దిండి ఎత్తిపోత పథకాలు ప్రారంభించారని అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత వాటి ప్రస్తావన తేవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలన్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడే హంద్రీనీవాకు లైనింగ్ చేయాలని జీవో ఇవ్వడం జరిగిందని ఇప్పుడు వద్దు అని శాసనమండలిలో వైకాపా సభ్యులు మాట్లాడడం ద్వంద విధానానికి నిదర్శనం అన్నారు. అధికారపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో మాట మాట్లాడటం ఎంతవరకు న్యాయమన్నారు. అసెంబ్లీకి రారు, మండలికి వస్తారు గత పాలనలో ఆమోదం తెలిపినవి మళ్ళీ వద్దని వాదిస్తారన్నారు. గండికోట నిర్వాసితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు నాయుడు ఇవ్వాలంటూ డిమాండ్ చేయడం ఫర్ అవివేకానికి నిదర్శనం అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడుకి సిద్ధంగా ఉందని ఎంపీ అవినాష్ రెడ్డి కావాలంటే వాళ్ళ అన్నను అసెంబ్లీ కుర్చీ ప్రజా సమస్యలను చర్చించేలా చేయాలని అంతేగాని ఇష్టానుసారంగా మాట్లాడడం తగదని ప్రజలకు అన్నీ కూడా తెలుసని ఇప్పటికైనా ప్రజా శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని ప్రజా సమస్యలపై పోరాడేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మైసూరా రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు ఎదురుచూపు

### మార్కెట్‌యార్డు పదవి కోసం నాయకులు పోటాపోటీ

**మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :**

నియోజకవర్గంలోని టిడిపి నాయకులు నామినేటెడ్‌పదవుల కోసం ఎదరుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన మూడు పార్టీల్లోని నాయకులు పదవుల కోసం అర్రులు చాస్తున్నారు. ముఖ్యంగా మార్కెట్‌యార్డు పదవి కోసం నాయకులు మధ్య తీవ్ర పోటీ నెలకొంటున్నట్లు తెలుస్తోంది. టమోటా మార్కెట్‌యార్డు రాష్ట్రంలోనే వ్యాపార లావాదేవీలకు పేరుపొందిన విషయం తెలిసిందే. మార్కెట్‌యార్డుతో పాటు పలు ఆలయాలకు చెందిన ఛైర్మెన్ పదవుల కోసం కూడా ఆశావహుల సంఖ్య ఎక్కువుగానే ఉన్నట్లు తెలుస్తోంది. పదవుల కోసం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చుట్టూ నాయకులు ప్రదక్షణలు చేస్తున్నారు. కొంతమంది ఏకంగా అధిష్టానానికే విన్నవించుకొని పదవులు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు అవుతుండడంతో ఉగాది తరువాత నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చెప్పడంతో పదవుల కోసం ఆశించేవారిలో ఆశలు చిగురిస్తున్నాయి. టిడిపి, జనసేన, బిజెపి పార్టీలకు చెందిన వారు వివిధ కోణాల్లో పదువుల దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు వచ్చే స్థానిక ఎన్నికల్లో మున్సిపల్ ఛైర్మెన్, జడ్పీటిసి, ఎంపిపి పదవులు కోసం కూడా ఇప్పటి నుండే పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ఏడాదిలోపు సర్పంచ్‌తో పాటు వివిధ స్థానిక ఎన్నికల జరగనున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో నామినేటెడ్ పదవుల కోసం బలిజ, కమ్మ, రెడ్డి, వైశ్య, చేనేత, బిసి వర్గాలకు చెందిన వారు ఎక్కువుగా పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. టిడిపి గెలుసుకోసం ఎన్నికల్లో తొలినుంచి కష్టపడిన వారికి ప్రాధాన్యత ఉంటుందంటూ పార్టీ వర్గాలు బాహాటంగా చెబుతున్నాయి. నామినెటెడ్ పదవులు ఎవరికి వరిస్తాయో కొన్నాళ్ళు వేచి చూడాలని పలువురు చెబుతున్నారు. సీనియర్లుగా ఉంటున్న వారు పదవులు తమకే వస్తాయని గట్టిగా నమ్ముతున్నారు.




డి సిసి బ్యాంక్ కడప నందు అమరవీరుల దినోత్సవం

# చినుకుల్లోనూ మెరుపులీనుతూ..



సీజన్ ఏదైనా.. ముఖం అందంగా మెరవాలనుకుంటాం. అయితే ఈ వర్షాకాలంలో తడిసినప్పుడు మేకప్ కరుగుతుంది. ముఖమంతా ప్యాచ్‌లుగా కనిపించడంతో ఇబ్బందిగా అనిపిస్తుంది. అలాకాకుండా ఉండాలంటే మేకప్‌లో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలంటున్నారు నిపుణులు.

చర్మాన్ని ఈ సీజన్‌లో పొడారనివ్వకుండా జాగ్రత్తపడాలి. వాతావరణం చల్లగా ఉందంటూ నీటిని తీసుకోకుండా ఉండకూడదు. శరీరానికి కావాల్సినంత నీటిని అందించాలి. అప్పుడే చర్మం ఆరోగ్యంగా తేమగా ఉంటుంది. ఇక మాయిశ్చరైజర్ విషయానికొస్తే మిగతా కాలాల్లో వాడే దానికి ప్రాధాన్యం ఇవ్వకూడదు. ఇది ముఖాన్ని జిడ్డుగా మారుస్తుంది. ఆ తరవాత ముఖంపై వేసే మేకప్‌నూ ప్రభావితం చేస్తుంది. బదులుగా నాణ్యమైన, నీటి ఆధారిత మాయిశ్చరైజర్‌ను ఎంచుకుంటే సరి. ఇది మేకప్‌కు మంచి బేస్ అవుతుంది.

చినుకులు పడినప్పుడు కూడా ముఖంపై ప్యాచెస్‌లా కనిపించనివ్వదు. మస్కారా కూడా వాటర్‌ప్రూఫ్ అయితేనే మేలు. కళ్లకు పెట్టిన వెంటనే త్వరగా ఆరుతుంది. తడికి కరగకుండానూ ఉంటుంది. మేకప్ తీసేయాలనుకున్నప్పుడు గులాబీనీళ్లలోనో కొబ్బరినూనెలోనో ముంచిన దూదితో తేలికగా శుభ్రం చేయొచ్చు.

**పౌడర్ ఆధారితంగా...** ముఖ చర్మం మృదువుగా మెరిసేలా కనిపించడానికి ముందుగా వేసే ప్రైమర్ విషయంలో మ్యాట్ ఫినిష్ ఇచ్చేదాన్ని ఎంచుకోవాలి. మేకప్ చెరిగిపోకుండా ఇది నిలపగలుగుతుంది. అలాగే మేకప్‌లో క్రీమ్స్ వినియోగంకన్నా పౌడర్ వాడితే మంచిది. ఈ సీజన్‌లో లైట్ వెయిట్ లిక్విడ్ ఫౌండేషన్‌లో ముందుగా కొంచెం వదులుగా ఉండే పౌడర్ కలుపుకోవాలి. మందపాటి ఫౌండేషన్ బ్రష్‌తో తేలికపాటిలేయర్స్‌గా అప్లై చేయాలి. ఈ విధానంలో ముఖం తడిసినా ప్యాచెస్‌లా కనిపించదు. స

**తక్కువగా....** లిప్‌స్టిక్ గ్లాసీగా కనిపించేది కాకుండా మ్యాట్ లుక్ ఇచ్చేది తీసుకోవాలి. అనుకోకుండా చినుకుల్లో తడిసినప్పుడు ఇది చెరగకుండా, పెదవులకు న్యూట్రల్ టింట్ ఇస్తుంది. ఎక్కువ సమయ తాజాగా కనిపించేలానూ చేస్తుంది. అంతేకాదు, వర్షాకాలంలో ఎంత తక్కువ మేకప్ వేస్తే అంత మంచిది. చెక్కిళ్లు, గడ్డం, ముక్కు చివర, కనుబొమల మధ్య మానరతం వాటర్‌ప్రూఫ్ కన్సీలర్‌ను బ్రష్‌తో కాస్తంత హైలైట్ చేయగలిగితే చాలు. చివరగా మేకప్ సెట్టింగ్ స్ప్రే తప్పనిసరి. ఇది మేకప్ కరగకుండా కాపాడుతుంది. చినుకుల్లోనూ మెరిసే మోము సొంతమవుతుంది. □

# వారి గెలుపు వెనక పూర్ణిమ



**2014 ఏషియన్ క్రీడలు.. శ్వేతా చౌదరి షూటింగ్‌లో కాంస్యం గెలిచింది. అలా విజేతలను ప్రకటించగానే.. ఆమె భర్త నుంచి పూర్ణిమకి ఫోన్! కాల్ కనెక్ట్ అవ్వగానే భావోద్వేగంతో 'థాంక్యు' అనే చెప్పాక అతనికీ నోట మాట పెగల్లేదు. ఇంకోసారి హీనా సిద్ధూ బంగారు పతకం గెలిచినప్పుడూ అంతే! అయితే ఈ సారి హీనానే నేరుగా ఆ మెడల్‌ని తెచ్చి పూర్ణిమ మెడలో వేసింది. అసలు ఎవరీ పూర్ణిమ రమణ్ గోమ్‌దిర్? వీళ్ల గెలుపులో ఆమె పాత్ర ఏమిటంటే..**

ఇంట్లో ఎవరికీ క్రీడా నేపథ్యం లేదు. కానీ క్రికెట్ వస్తోందంటే పూర్ణిమ కుటుంబమంతా టివి ముందుకు చేరిపోతారు. ఇక బామ్మ సంగతైతే అసలు చెప్పనక్కర్లేదు. 80 ఏళ్ల వయసున్నా టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లనీ ఆసక్తిగా చూసేది. వాటిని ఆవిడ విశ్లేషిస్తోంటే పూర్ణిమ ఆసక్తిగా వినేవారు. అసలు బామ్మ నుంచే క్రికెట్‌పై ప్రేమ మొదలైందామెకు. ఈమె స్వస్థలం ఢిల్లీ. అహ్మదాబాద్, ఢిల్లీల్లో పెరిగారు. స్కూల్ క్రికెట్ టీమ్‌లో ఆడినా తరవాత కొనసాగించలేక పోయారు. కానీ ఆటలకు సంబంధించిన కెరియర్‌నే ఎంచుకోవాలన్నది పూర్ణిమ కల. కానీ ఇంట్లోవాళ్లకేమో తను వైద్యవిద్య చదివితే చూడాలని ఆశ. ఏం తోచక చూస్తోన్న పూర్ణిమకు ఆమె అంకుల్ ఫిజియోథెరపీ చదవమని సలహానిచ్చారు. అప్పుడైతే ఆటగాళ్లతో కలిసి పనిచేయొచ్చు. అమ్మానాన్నల కలా నెరవేతుందని బెంగళూరులోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నుంచి బ్యాచిలర్స్, మంగళూరులోని డా.ఎంవీ శెట్టి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ నుంచి పిజి పూర్తి చేశారు.

**ఆట నేర్చుకుని మరీ..** అమ్మాయి.. పైగా బక్కపలచన. ఈమె ఎలా ఈ రంగంలో నెగ్గుకొస్తుంది. సహాధ్యాయులు ఎన్నోసార్లు తన ముందే ఈ సందేహాన్ని వెలిబుచ్చేవారు. కానీ పూర్ణిమ అవేమీ పట్టించుకోకుండా కష్టపడి చదివారు. చదువు పూర్తవడంతోనే తొలి అవకాశం తలుపు తట్టింది. 2010 కామన్‌వెల్త్ క్రీడల్లో పోటీపడుతోన్న సీఆర్‌పిఎఫ్ షూటింగ్ టీమ్‌కి 'స్పోర్ట్స్ ఫిజియో'గా పనిచేసే అవకాశం దక్కించుకున్నారు. ఆట సాధనలో భాగంగా, వ్యాయామం చేసేటప్పుడు క్రీడాకారులు గాయాల పాలు అవ్వడం చూస్తుంటాం కదా. అలా కాకుండా జాగ్రత్తలు సూచించడం, పొరపాటున ఏదైనా ప్రమాదానికి గురైనా త్వరగా కోలుకునేలా చూడటం వంటివి ఈమె విధులు. ఉత్సాహంగా బాధ్యతలు నిర్వర్తించారు. దీంతో టెన్నిస్, రెజ్లింగ్.. ఇలా భిన్న క్రీడాకారులతో పనిచేసే అవకాశాలొచ్చాయి. అప్పుడే ఓ ఆలోచన తట్టింది పూర్ణిమకు. క్రీడాకారులకు సలహా ఇవ్వడం తేలికే. కానీ అవి వాళ్లకు నిజంగా ఉపయోగపడితేనే కదా ప్రయోజనం అనిపించింది. అది సాధ్యమవ్వాలంటే ఆట గురించి తెలిసుండాలి అనుకున్నా. అందుకే కోచ్‌ల దగ్గరికి వెళ్లి ఆటను నేర్పించమని అడిగా. కొత్తల్లో గాయాలు అవుతాయన్నా పర్లేదని చెప్పి మరీ నేర్చుకున్నా. అది ఆటగాళ్ల గురించి లోతుగా తెలుసుకునే వీలు కల్పించింది అంటారు పూర్ణిమ. ఈ తత్వమే ఆమెకు ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులతో పనిచేసే వీలు కల్పించింది.



**విజేతలుగా చేయాలని....** ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ (ఓజీక్యూ).. పూర్ణిమ పనితీరును గమనించి, తమతో కలిసి పనిచేయమని ఆహ్వానించింది. ఓజీక్యూ.. సత్తా ఉన్న క్రీడాకారురలను ఎంపిక చేసి, ఆరోగ్యకరమైన ఆహారం దగ్గర్నుంచీ కోచింగ్, అవసరమైన పరికరాలు అందించడం వరకూ అన్ని అంశాల్లో సాయం చేస్తుంది. తగిన శిక్షణనిచ్చి మెరికల్లా తీర్చిదిద్దుతుంది. ప్రకాశ్ పదుకోణ్, విశ్వనాథన్ ఆనద్, నీరజ్ బజాజ్, విద్యా షా వంటి ఎందరో ఈ సంస్థలో డైరెక్టర్లుగా ఉన్నారు. ఓజీక్యూతో కలిసి పూర్ణిమ 14 ఏళ్లుగా ఒలింపిక్స్ పారాలింపిక్స్ అభ్యర్థులకు శిక్షణలో సాయమందిస్తున్నారు. మెడికల్‌సైన్స్ విభాగానికి అధిపతిగా సంబంధిత బృందాన్నీ నడిపిస్తున్నారు. శ్వేత ఏషియన్ క్రీడలకు సిద్ధమయ్యేటప్పటికి వెన్నునొప్పితో బాధపడుతోంది. హీనాకేమో గాయంతో సమస్య. వీళ్లే కాదు.. ఇలాంటి సమస్యలతో సతమతమయ్యే మరెందరో క్రీడాకారులు వాటిని అధిగమించి పతకం సాధించినప్పుడు నేనే గెలిచా అన్నంత ఆనందం అనే పూర్ణిమ ప్రో టెన్నిస్ అకాడమీలోనూ సేవలందిస్తున్నారు. ఇంటర్నేషనల్ రగ్బీ టోర్నమెంట్‌కి డోపింగ్ కంట్రోల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ట్రాన్స్‌స్టాడియా యూనివర్సిటీకి ప్రోగ్రామ్ డైరెక్టర్ కూడా.

# సహజంగా పరిమళిద్దాం..



పార్టీ, ఫంక్షన్ ఉంటే చాలు, అందంగా ముస్తాబు అయిపోతాం. తాజాదనం కోసం పెర్‌ఫ్యూమ్స్ వాడేస్తాం. అయితే వాటిల్లోని రసాయనాల కారణంగా కొన్నిసార్లు దుస్తులు పాడయ్యే అవకాశం ఉంది. అలా జరగకూడదంటే ఈ సహజ నూనెలు వాడాల్సిందే..

**లావెండర్..** ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది చర్మాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది. లావెండర్ ఆయిల్ నరాలను శాంతపరచి, మానసిక స్థితిని మెరుగుపరచడానికి సాయపడుతుంది.

**పెప్పర్‌మింట్..** ఈ నూనెలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాల కారణంగా దీన్ని పెర్‌ఫ్యూమ్‌గా వాడుకుంటే రోజంతా ఆహ్లాదంగా దీన్ని పెర్‌ఫ్యూమ్‌గా వాడుకుంటే, రోజంతా ఆహ్లాదంగా ఉంటుంది.

**గంధం నూనె..** చందనం శీతలీకరణ గుణాలకు అనుగుణంగా ఉంటుంది. చర్మ సౌందర్యానికి ప్రసిద్ధి చెందిన గంధపు ఎసెన్షియల్ ఆయిల్‌ను పెర్‌ఫ్యూమ్‌గానూ ఉపయోగించవచ్చు. ఇది మానసిక స్థితిని మెరుగుపరిచి తాజాదనాన్ని అందిస్తుంది. రోజ్ ఎసెన్షియల్ ఆయిల్.. ఉత్తేజపరిచే సువాసనను కలిగి ఉంటుంది. ఇది యాంటీ

# స్టీల్ సబ్బు

ఉల్లిపాయలు కోసినా, చేపలకి మసాలా పట్టించినా, వెల్లుల్లి దంచినా ఆ వాసన మన చేతుల నుంచిఒ పట్టాన పోదు. ఆ నీచు వాసన పోగొట్టుకోవడానికి సాధారణ సబ్బుతో రుద్దుతాం ఆ వాసన తినేటప్పుడు ఇబ్బందిగా ఉంటుంది. మరి దీనికి పరిష్కారం లేదా అంటే? ఎందుకు లేదు స్టీల్ సోప్ ఉందిగా. ఈ సబ్బుని ప్రత్యేకమైన స్టెయిన్‌లెస్‌స్టీల్‌తో తయారుచేసింది. ఈ సబ్బుతో చేతుల్ని రుద్దినప్పుడు.. ఉల్లిపాయ, వెల్లుల్లి వంటివాటిలో ఉండే ఘాటైన సల్ఫర్ మూలకాలని గ్రహించి మన చేతులు దుర్వాసనలు రాకుండా అడ్డుకుంటుంది.



# గర్వం పతనానికి తొలిమెట్టు



**'దేవుడు అహం కారులను** ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును' (యాకోబు 4:6), 'దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును' (1 పేతురు 5:5). ఈ వాక్యం రెండుసార్లు కొత్తనిబంధనలో పేర్కొనబడింది. ఎందుకని రెండుసార్లు ఒకేవిషయాన్ని చెప్పారంటే మనలో అహంకారం అస్సలు ఉండకూడదని అర్థం. ఒకమ్మాయి సిటీ బస్సు ఎక్కింది. ఆమె తాను దిగాల్సిన బస్టాప్‌ను బస్సు ఎక్కుతున్నప్పుడే డ్రైవర్‌కు చెప్పింది. డ్రైవర్ ముందే ఆ అమ్మాయికి ఈ బస్సు ఆ స్టాప్‌లో ఆగదు అని చెప్పాడు. అయితే ఆ అమ్మాయి డ్రైవర్‌తో కాస్త వాదనపెట్టుకుంది. ఎందుకు ఆపరు, అక్కడ స్టాప్ ఉందికదాని. అందుకు డ్రైవర్ ఏమీ అనలేదు. అయితే ఆమె తన స్టాప్ వస్తున్నప్పుడే ముందుకొచ్చింది. డ్రైవర్ ఆమెను చెవిలో ఇయర్‌బర్డ్స్ తీసి, సెల్‌ఫోన్‌ను బ్యాగులో పెట్టుకోమని చెప్పాడు. అందుకు ఆ అమ్మాయి ఆ డ్రైవర్‌తో కాస్త అహంకారంగా వాదించింది. దీంతో డ్రైవర్ ఆమె దిగాల్సిన బస్టాప్‌లో బస్‌ను ఆపలేదు. ఆమె అడిగినా ఆపలేదు. ఆ అమ్మాయిలో ఉన్న గర్వమే ఆ బస్సు ఆగకపోయేందుకు కారణమని తోటిప్రయాణీకులు అనుకున్నారు. దీన్నివల్ల ఆ అమ్మాయికి అమూల్యమైన సమయం వ్యర్థమైపోయింది. ప్రయాసపెరిగింది. మనలో దాగి ఉన్న అహంకారం చాలాసార్లు మనకే అనేక నష్టాలకు గురిచేస్తుంది. అహంకారమే కదా ఒకప్పుడు దేవుడి దూతగా ఉన్న లూసీఫర్ అపవాదిగా మారిపోయి, పాతాళలోకం, నరకాగ్నికి వారసుడిగా అయ్యాడు. సాతాను అహంకారం నేడు అనేకుల్లో ప్రవహిస్తోంది. అందుకే ఆధ్యాత్మికంగా ఎదగాల్సిందిపోయి, గర్వంతో పతనమై నరకాగ్నికి వారసులుగా జీవిస్తున్నారు. సర్వజ్ఞాని, అనంతశక్తి, సంపద, ఆధిపత్యం, మహిమాప్రభావం గల దేవాదిదేవుడు యేసుక్రీస్తు కూడా అన్నివిషయాల్లో తండ్రికి విధేయత చూపించాడు. తండ్రికి ఇష్టమైన పనులను ప్రభువు చేసాడు తప్ప, తనంతట తాను ఏదీ చేయలేదు. తండ్రికి ఏది ఇష్టమో యేసుప్రభువు దాన్నే చేశాడు. ప్రభువు అడుగుజాడల్లో మనం పయనించాలి. దేవుడు ప్రతి విశ్వాసికి ఏదో ఒక తలాంతు లేక వరం ఇస్తాడు. కొందరు బాగా దేవుడి వాక్యాన్ని బోధిస్తారు, మరికొందరు పాటలు బాగాపాడతారు, చక్కగా పని చేస్తారు. అయితే ఆ టాలెంట్‌ను బట్టి పేరు, సంపద పెరిగేసరికి మొదట ఉన్న విధేయత, దీనత్వం ఉండదు. తమలో ఉన్న టాలెంట్‌ను బట్టి దేవుడిని మహిమపరుస్తూ, అనేకులను దేవుడి మార్గంలో నడిపించేందుకు బదులుగా గర్వంతో విర్రవీగుతూ పతనమైపోతున్నారు. తగ్గించుకునే స్వభావాన్ని మనం అలవర్చుకోవాలి. 'నాశనమునకు ముందు గర్వము నడచును, పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును' (సామెతలు 16:18). మనల్ని మనం ఎంతగా తగ్గించుకుంటామో, దేవుడు మనల్ని అంతగా హెచ్చిస్తాడు.

-పి.వాణీపుష్ప

అంతర్వాణి

# పోషకాల మునగాకు రుచులు

తోటకూర, పాలకూర వంటివి తరచూ తింటాం కానీ..మునగాకును పెద్దగా పట్టించుకోం. నిజానికి ఇది పోషకాల గని, ఔషధాల నిధి. బలాన్నిస్తుంది, రోగనిరోధకశక్తిని పెంచుతుంది. ఈ కాలంలో వచ్చే అనారోగ్యాల నుంచి కాపాడుతుంది. అంత మంచి మునగాకుతో ఈ వెరైటీలు చేసి చూడండి. !

## థోరన్..



**కావలసినవి :** మునగాకు-4 కప్పులు, కొబ్బరి తురుము- కప్పు, ఉల్లిపాయ ముక్కలు- కప్పున్నర, ఉప్పు-రుచికి సరిపడా, ఆవాలు, జీలకర్ర, పసుపు, వెల్లుల్లి తరుగు- చెంచా చొప్పుప, నూనె-2 టేబుల్ స్పూన్లు, ఎండుమిర్చి-3, కరివేపాకు-2 రెబ్బలు.

**తయారీ :** మునగాకునుకడిగి నీళ్లు లేకుండా వడకట్టాలి. మిక్సీ జార్‌లో కొబ్బరి తురుము, అరకప్పు ఉల్లిముక్కలు, పసుపు, వెల్లుల్లి తరుగు, ఎండుమిర్చి వేసి గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. ఆవాలు వేయాలి. అవి చిటపట లాడతున్నప్పుడు జీలకర్ర, కరివేపాకు, మిగిలిన ఉల్లిముక్కలను జోడించాలి. అవి కాస్త వేగాక.. మునగాకు, ఉప్పువేసి మగ్గనివ్వాలి. మధ్యమధ్యలో కలియబెడుతూ.. పది నిమిషాల తర్వాత కొబ్బరి మిశ్రమం జత చేయాలి. ఇంకో ఏడు నిమిషాల తర్వాత దించేస్తే.. ఘుమఘుమలాడే 'మునగాకు థోరన్' సిద్ధం.

## మునగ మఖానా...



**కావలసినవి :** ఫుల్ మఖానా- కప్పు, మునగాకు పొడి-టేబుల్ స్పూన్, నెయ్యి-రెండు చెంచాలు, ఛాట్ మసాలా-అర చెంచా, ఉప్పు-రుచికి సరిపడా.

**తయారీ :** కడాయిలో ముఖానాను కలియ తిప్పుతూ సన్న సెగ మీద వేయించాలి. నాలుగైదు నిమిషాల తర్వాత ఒకటి చేతిలోకి తీసుకుని నొక్కిచూడండి. సాగకుండా విరిగితే చక్కగా వేగినట్లు. వీటిని గిన్నెలోకి తీసి..అదే కడాయిలో నెయ్యి, మునగాకు పొడి, ఛాట్ మసాలా, ఉప్పు, వేయించిన ఫుల్ మఖానా వేసి..నిమిషం వేయించి దించేయండి. ఇది వేడిగా ఉన్నప్పుడే కరకరలాడుతూ రుచిగా ఉంటుంది. తర్వాత తినాలనుకుంటే గాలి చొరబడని సీసాలో భద్రం చేయాలి.

## మునగాకు పప్పు...



**కావలసినవి :** కందిపప్పు, మునగాకు-కప్పు చొప్పున, ఉల్లి తరుగు- అరకప్పు, చింతపండు- నిమ్మకాయంత, పచ్చిమిర్చి ముక్కలు-టేబుల్ స్పూన్, ఉప్పు-రుచికి సరిపడా, పసుపు-అర చెంచా, ఎండుమిర్చి-2, కరివేపాకు-4 రెబ్బలు, వెల్లుల్లి తరుగు- ముప్పావు చెంచా, ఆవాలు, శనగ పప్పు, మినపప్పు, జీలకర్ర-చెంచా చొప్పున, ఇంగువ-అర చెంచా.

**తయారీ :** కందిపప్పు, మునగాకులను రెండు కప్పుల నీళ్లు పోసి కుక్కర్‌లో మూడు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి. ఆవిరి పోయిన తర్వాత మూత తెరిచి చారు గరిటెతో మెత్తగా మెదపాలి. దీనికి కొన్ని నీళ్లు, చింతపండు గుజ్జు, పసుపు, ఉప్పు, జోడించి ఉడికించాలి. రెండు పొంగులు వచ్చాక దించేయాలి. ఇప్పుడు ఆవాలు, శనగపప్పు, మినపప్పు,జీలకర్ర, వెల్లుల్లి, తరుగు, ఎండుమిర్చి కరివేపాకు, ఇంగువలతో తాలింపు వేసేనత సరి. రుచికరమైన మునగాకు పప్పు రెడీ.

## ఆలూ మొరింగా సబ్జీ



**కావలసినవి :** మునగాకు-2 కప్పులు, బంగాళదుంపలు-3, ఉల్లితరుగు-పావు కప్పు, నూనె-2 టేబుల్ స్పూన్లు, ఉప్పు-రుచికి సరిపడా, తరిగిన పచ్చిమిర్చి-టేబుల్ స్పూన్, వెల్లుల్లి తరుగు-చెంచా, జీలకర్ర-ఒకటిన్నర చెంచా, గరంమసాలా-అర చెంచా, కారం-ముప్పావు చెంచా, పసుపు, ఇంగువ-పావు చెంచా చొప్పున.

**తయారీ :** బంగాళదుంపలు చెక్కు తీసి, అంగుళమత ముక్కలు కోయాలి. కడాయిలో నూనె వేడయ్యాక జీలకర్ర.. అది వేగాక.. పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి తరుగు, ఇంగువ, ఉల్లిపాయ ముక్కలు ఒక్కొక్కటిగా వేయాలి. ఉల్లి దోరగా వేగిన తర్వాత బంగాళదుంప ముక్కలు, పసుపు, ఉప్పు వేసి వేయించాలి. నాలుగు నిమిషాల తర్వాత మునగాకు జతచేసి.. మధ్యమధ్యలో కలియ తిప్పుతూ ఇంకో ఆరేడు నిమిషాలు వేయించాలి. చివర్లో కారం, గరంమసాలా జోడించి కలియబెట్టి దించేస్తే సరిపోతుంది.

## మునగాకు పచ్చడి..



**కావలసినవి :** మునగాకు, కొబ్బరి తురుము-కప్పు చొప్పున, పచ్చిమిర్చి-8, అల్లం ముద్ద- చెంచా, ఉప్పు-రుచికి సరిపడా, నూనె-2 టేబుల్ స్పూన్లు, నిమ్మరసం-రెండు చెంచాలు, ఆవాలు, జీలకర్ర-చెంచా చొప్పున, కరివేపాకు-2 రెబ్బలు, ఇంగువ-పావు చెంచా,

**తయారీ :** కడాయిలో ఒక టేబుల్ స్పూన్ నూనె కాగనిచ్చి పచ్చి మిర్చి, మునగాకులను ఒక నిమిషం వేయించాలి. ఎక్కువ వేగకూడదు. చల్లారిన తర్వాత మిక్సీ జార్‌లో వేసి.. కొబ్బరి తురుము, అల్లం ముద్ద, ఉప్పు, అర కప్పు నీళ్లు జోడించి మెత్తగా గ్రైండ్ చేయాలి. మిగిలిన నూనె వేడిచేసి.. ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, ఇంగువలతో తాలింపు వేసి, నిమ్మరసం కలిపితే సరి.. వహ్వా అనిపించే మునగాకు పచ్చడి తయారైపోతుంది.

## పరోటా...



**కావలసినవి :** గోధుమపిండి, మునగాకు-కప్పు చొప్పున, అల్లం ముద్ద-చెంచా, ఉప్పు-రుచికి సరిపడా, జీలకర్ర, కారం, గరంమసాలా-అర చెంచా చొప్పున, వాము, పసుపు-పావు చెంచా చొప్పున, నూనె-చెంచా, నెయ్యి-2 టేబుల్ స్పూన్లు.

**తయారీ :** మునగాకు కడిగి, పావుగంట నీళ్లలో ఉంచి, తర్వాత నీళ్లు తీసేయాలి. ఒక వెడల్పాటి పాత్రలో గోధుమపిండి, మునగాకు, అల్లం ముద్ద, ఉప్పు, జీలకర్ర, కారం, గరం మసాలా, వాము, పసుపు, నూనె వేసి కొన్ని నీళ్లతో బాగా కలపాలి. ఈ పిండిని ఒక అరగంట పక్కనుంచి, మరోసారి కలిపి..

# చెలి చిట్కా

ఆభరణాలకు మురికి పడితే పాలిష్ పెట్టించ కూడదు. పాలిష్ పెట్టించకుండా రెండుచెమ్చాల సర్ఫ్‌పౌడర్‌ను అరగ్లాసు నీటిలో కరిగించి ఆ మిశ్రమంలో బంగారు నగలను ఒక రాత్రంతా నాననిచ్చి తెల్ల వారక బ్రష్‌తో శుభ్రపరచు కోవాలి. ఆ పిదప క్లాత్‌తో తుడిచిపెట్టకోవాలి. □

# పెద్దేరును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా

తంబళ్లపల్లె మార్చి 23 ప్రభాతవార్త :

తంబళ్లపల్లె, పెద్దమండెం మండలాల రైతులకు జీవకర్రగా నిలిచిన పెద్దేరు ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఆదివారం ఆయన పెద్దేరు ప్రాజెక్ట్ ఎడమ కాలువ ద్వారా రైతుల పంటలు, చెరువులకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పెద్దేరు ప్రాజెక్ట్ చైర్మన్ కొటాల శివకుమార్,జేఈ సతీష్ కుమార్, కాంట్రాక్టర్ శ్రీనివాసుల రెడ్డిలు ఘన స్వాగతం పలికారు. జయ చంద్రారెడ్డి సాంప్రదాయ బద్ధంగా గంగాదేవికి ప్రత్యేక పూజలతో జల హారతి నిర్వహించి ఎడమ కాలువ గేటు ఎత్తి నీటిని వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబళ్ల పల్లెకు మల్లయ్య కొండ, పెద్దేరు ప్రాజెక్టులు రెండు కళ్ళు లాంటివని వీటిని పర్యాటక శాఖ సహకారంతో ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. పెద్దేరు ప్రాజెక్ట్ ఆయకట్టు నీటి ద్వారా సుమారు 5 వేల ఎకరాలు రెండు మండలాల రైతులకు పంట సాగు తో పాటు మూగజీవాలకు నీటి సౌకర్యం ఏర్పడుతుందన్నారు. ప్రాజెక్ట్ లో పార్కుల మరమ్మతులు, రోడ్డు, గెస్ట్ హౌస్లు, క్వార్టర్స్, బోటింగ్, చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుచేసి ఆహ్లాదకరమైన ప్రాంతంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట ప్రాజెక్టు



పెద్దేరు సాగునీటికి జల హారతి నిర్వహిస్తున్న జయచంద్రారెడ్డి

వైస్ చైర్మన్ శివయ్య, సభ్యులు తేజ మూర్తి నాయుడు, గంగిరెడ్డి, శివగంగిరెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, బేరి శ్రీనివాసులు, తులసీధర్ నాయుడు, ఉత్తమ రెడ్డి, తరుగు శివారెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, రామచంద్ర, రామచంద్ర రెడ్డి, ఆనంద్, బాలాజీ, జైపాల్ నాయుడు, సోమశేఖర్, జగదీష్, బిజెపి నాయకుడు శంకర్ రెడ్డి,అల్లావుద్దీన్, సుధాకర్, మల్లయ్య, కోట కొండ చిన్న రెడ్డప్ప, రాజేష్, గురుమూర్తి, నిజాముద్దీన్, టిడిపి కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోరాట స్ఫూర్తి రాబోయే తరానికి ఆదర్శం



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పీలేరు, కె.వి పల్లి ,మార్చి 23 ప్రభాతవార్త:

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, వర్ధంతి సందర్భంగా వారి చిత్రమాటాలను నారమాకుల మిట్టలో సిపిఐ ఆధ్వర్యంలో పూలమాలవేసి జ్యోతులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టిఎల్ వెంకటేష్ మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి స్వరాజ్యం మా జన్మ హక్కు అని నినాదించి దేశ స్వతంత్రం కోసం 23 సంవత్సరాల యవ్వన దశలో ఉరికంబాన్ని ముద్దాడిన గొప్ప యుద్ధ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవులని వారి పోరాట స్ఫూర్తి రాబోయే తరానికి ఆదర్శప్రాయం అని వారు కొనియాడారు క్షమాభిక్ష కోరితే వదిలేస్తామని చెప్పినా కూడా లేదు నా దేశం కోసం మా ప్రాణాలైనా అర్పిస్తాం కానీ క్షమాభిక్ష అడగమని దేశభక్తి చాటుకున్న యుద్ధ వీరులు వారన్నారు చివరి కోరిక కూడా మమ్మల్ని ఉరి తీయొద్దండి కాల్చి చంపండి అని కోరుకున్న మహనీయులు వారు అన్నారు, వారి అడుగుజాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నిర్దిష్టమైన పోరాటాలకు సిద్ధం కండి



రైల్వేకోడూరు మార్చి 23 ప్రభాతవార్త

ఆదివారము భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికేఎంయు) నియోజకవర్గ అధ్యక్షులు కామ్రేడ్ మొగిలి వినయ్ అధ్యక్షతన సమావేశం జరిగినది, ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికేఎంయు) అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామ్రేడ్ పందు గోల మణి, కామ్రేడ్ తోపు కిష్టప్ప మాట్లాడుతూ, గత కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగతనేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే దళిత, గిరిజనులకు ప్రతి కుటుంబానికి రెండు ఎకరాలు ఇవ్వాలని ఉద్దేశంతో ఏడు విడుదల భూ పంపిణీ నిరుపేదలకు పంచారని వారు హర్షం వ్యక్తం చేశారు, వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వంగానీ, ప్రస్తుతం ఉన్న ఎన్డీఏ కూటమి బలపరిచిన తెలుగు దేశం ప్రభుత్వంగానీ ఎక్కడ ఒక సెంటు భూమి పేదలకు పంచిన పాపాన పోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ జ్యోతి చిన్నయ్య, నియోజవర్గ సహాయ కార్యదర్శి కామ్రేడ్ తుమ్మల చైతన్య, కోడూరు మండల సిపిఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం( బి కే ఎం యు) రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి ఎం జయరామయ్య, ఓబులవారిపల్లి మండల అధ్యక్షులు కామ్రేడ్ వెంకటరమణ, కార్యదర్శి ఎం రమణయ్య, పెనమలూరు మండల కార్యదర్శి రేవూరి కృష్ణయ్య, పుల్లంపేట మండలం గౌరవ అధ్యక్షులు లక్ష్మయ్య, నరసింహులు, ఓబులవారిపల్లి మండలం నాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కఠిన చర్యలు తీసుకోవాలి

పీలేరు, మార్చి 23 ప్రభాతవార్త:

తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గాంధీ కాలనీలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

### రైతులను ఆదుకోవడంలో

# వైకాపా, టిడిపి దొందూ దొందే

పోరుమామిళ్ల రూరల్, మార్చి 23ప్రభాతవార్త:

రైతులను ఆదుకోవడంలో వైకాపా, టిడిపి దొందూ దొందే అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం పోరుమామిళ్లలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతులు అష్ట కష్టాలు పడి పండించిన ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదు. కంది, సెనగ, జొన్న, పెసర, మినుము, మిరప, తదితర పంటలకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా లభించడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవలేదు.తెరచినా నాం కే వాస్తే అన్నట్లున్నాయ్. అన్నదాత సుఖీ భవ పథకం అన్నదాత దుఃఖీ భవ పథకం గా తయారయింది.202425 ఆర్థిక సంవత్సరం లో ఒక్క పైసా ఇవ్వ లేదు. 202526 లో రు 10706 కోట్లు కావలసి వుండగా రు 6300 కోట్లు మాత్రమే కేటాయించడ మయింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచి మద్దతు ధర కు పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని.అన్న దాత సుఖీ భవ పథకం క్రింద పెండింగ్ బకాయిలతో కలిపి ప్రతి రైతు ఖాతాలో రు 40000 లు వేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి. సి. సి. మెంబర్ డాక్టర్ అన్వర్, భాషా, బాలరామి రెడ్డి,ముజాహిద్, అసిఫ్, షాహిల్, అమర్, ఉత్తన్న, రాజు, రమణ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

# సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

### పవన్ కళ్యాణ్ హామీ నిలబెట్టుకోవాలి ! ఏఐటియుసి

రాజంపేట అర్బన్, మార్చి 23 ప్రభాతవార్త

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల సమయంలో కూటమి నేతగా పవన్ కళ్యాణ్ హామీ అమలు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది.ఆదివారం స్థానిక ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో టైల్స్ వర్కర్స్ యూనియన్ సమావేశం జమాల్ అధ్యక్షతన జరిగింది. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శిలు గంగాధర్, సాంబశివ ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని, సంక్షేమ బోర్డు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సొంత నిధులు కోటి రూపాయలు జమ చేస్తానని చెప్పిన హామీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి తొమ్మిది నెలలు కావస్తున్నా భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.12 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగినా భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి కార్మిక శాఖ మంత్రి చర్చించక పోవడం శోచనీయమన్నారు. 2006 సంవత్సరంలో సంక్షేమ బోర్డు ప్రారంభమై 2019 తరువాత గత ప్రభుత్వం సంక్షేమ బోర్డులు నిర్వీర్యం చేయడం జరిగిందన్నారు.ఏపీలో కూటమి తరపున మేనిఫెస్టోలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని పెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లేబర్ డిపార్టుమెంటులో సంక్షేమ కార్డులు పొందిన 22 లక్షల మంది కార్మికులే కాకుండా కార్డులు పొందని కార్మికులు సుమారు 30 లక్షల మంది ఉన్నారన్నారు.భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్లో ఉన్న క్లైములకు నిధులు మంజూరు చేసి కార్మికులను ఆదుకొనుటకు తగు చర్యలు త్వరితగతిన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాజంపేట నియోజకవర్గ కార్యదర్శి సికిందర్, ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు,భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ నాయకులు ముజఫర్, నర్సింహులు, టైల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు జమాల్, బాబు, రాముడు, నర్సింహులు,బడే సాబ్ వలీ, వెంకటస్వామి పాల్గొన్నారు.

## రంజాన్ సందర్భంగా దుస్తులు పంపిణీ



వేంపల్లి, మార్చి 23, ప్రభాతవార్త :

వేంపల్లి లోని తెలుగుదేశం పార్టీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్ఎండి షబ్బీర్ రంజాన్ సందర్భంగా ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. గత నాలుగు సంవత్సరముల నుండి షబ్బీర్ ఆఫీస్‌లో వేంపల్లి పంచాయతీలో పనిచేస్తున్న దాదాపు 70 మంది పారిశుద్ధ్య సిబ్బంది కి దుస్తులు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా షబ్బీర్ మాట్లాడుతూ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులు అరకొర జీతాలతో జీవిస్తున్నటువంటి వీరికి ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకంగా వారిని ఆదుకుంటే వారి జీవితాలు కూడా బాగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ షరీఫ్, గోటూరు నాగభూషణం, భాస్కర్, వెంకటేష్, టిడిపి యూత్ సోహెల్, హర్షద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

## ఎంబార్ కేషన్ పాయింట్ రద్దు తగదు

వేంపల్లి, మార్చి 23, ప్రభాతవార్త :



పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కోసం విజయవాడలో ఏర్పాటు చేసిన ఎంబార్గేషన్ పాయింట్‌ను కేంద్రం రద్దు చేయడం తగదని, ఇది పూర్తిగా కూటమి ప్రభుత్వ వైఫల్యమేనని రాష్ట్ర హజ్ కమిటీ మాజీ డైరెక్టర్ మునీర్ అన్నారు. వేంపల్లిలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో హజ్‌యాత్ర చేయడానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హజ్ యాత్రికులు హైదరాబాద్, బెంగళూరు నుండి వెళ్లేవారన్నారు. అయితే అప్పటి డిప్యూటీ సీఎం అంజాద్‌భాష, ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజంలు ఆంధ్రప్రదేశ్ నుండి వెళ్లే హజ్ యాత్రికుల సౌకర్యార్థం విజయవాడలో హజ్ హౌస్ లేకపోయినా కూడా గుంటూరు వద్ద ఉన్న నంబూరు మదరసాలో సకల ఏర్పాట్లు భోజన వసతి, తాత్కాలిక ఏసీలు ఏర్పాటు చేసి దాదాపు రూ.14 కోట్ల రూపాయలు వెచ్చించి హజ్ యాత్రకు వెళ్లే దాదాపు 2,800 మంది హాజీలను ఎటువంటి లోటు లేకుండా పంపారని తెలిపారు. అలాగే హజ్ యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.80 వేల సబ్సిడీ ఇచ్చిందని, ఎన్నికల కోడ్ వల్ల యాత్రికులకు రావాల్సిన సబ్సిడీ మొత్తం ఇవ్వలేదని, తెలుగుదేశం ప్రభుత్వం వచ్చి దాదాపు పది మాసాలైనా ఇప్పటివరకు హజ్ యాత్రికులకు సబ్సిడీ డబ్బు ఇవ్వలేదన్నారు. ముస్లింల ఓట్ల కోసం తాపత్రయపడే తెలుగుదేశం నాయకులు విజయవాడ ఎంబర్ కిషన్ పాయింట్ ను నిలుపుకోలేకపోవడం అత్యంత దారుణం అన్నారు.

## మత సామ్రాజ్యానికి ప్రతిక ఇఫ్తార్ విందు

పోరుమామిళ్ల రూరల్, మార్చి 23ప్రభాతవార్త:

పోరుమామిళ్ల పట్టణంలోని రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు 4 మసీదులలో బద్వేల్ నియోజకవర్గం వైసీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామ్రాస్యానికి ప్రతిక అని ఆయన అన్నారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనసులంతా సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని ఆయన కాంక్షించారు.. అనంతరం సామూహిక నమాజ్ అనంత సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నల్లేరు విశ్వనాథరెడ్డి

## పెరుగుతున్న గ్రామ సింహాలు స్వైర విహారం

రామసముద్రం మార్చి 23 ప్రభాతవార్త



ఇంట్లో నుంచి బయటికి రావాలంటే భయపడుతున్న మండలంలోని ప్రజలు రోజురోజుకు పెరిగిపోతున్న కుక్కలు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు. ఎందరో కుక్కలు దాడిలో గాయపడ్డారు. ఉదయం పూట పిల్లలను స్కూలుకు వదలాలంటే భయం ఒంటరిగా బయటికి రావాలంటే భయపడుతున్న మహిళలు. మండలంలో అనేకసార్లు ప్రజల మీద దాడి చేసిన కుక్కలు అయినప్పటికీ పట్టించుకోని అధికారులు. కనీసం దీనిపైన ప్రజాప్రతినిధులైన పట్టించుకుని అధికారుల ద్వారా ఈ కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని కోరుతున్న మండలప్రజలు. ఇది ఇలాగే కొనసాగితే మండలంలో జనం కంటే కుక్కలు ఎక్కువ అవుతాయని వాపోతున్న జనం ఇప్పటికైనా అధికారులు దీని మీద స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్న మండల వాసులు.

## గుండె పోటుతో దిలీప్‌కుమార్ మృతి

రామసముద్రం మార్చి 23ప్రభాతవార్త



రామసముద్రం మండలం, పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ, తిరుమలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చాకలి దిలీప్‌కుమార్ గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చాకలి దిలీప్ కుమార్. బ్రతుకు తెరువుకై లాండ్రి పనులకు బెంగళూరు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కులవృత్తి ల్యాండ్రింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. ఈ యువకుడు మృతి చెందడంతో తిరుమలరెడ్డిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మిట్స్‌లో సర్టిఫికెట్స్ కోర్సులకు పరీక్షలు

కురబలకోట మార్చి 23 ప్రభాతవార్త

మదనపల్లె సమీపంలో గల మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మదనపల్లె కళాశాల నందు విద్యార్థులకు మరియు అధ్యాపకులకు నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్హాన్స్డ్ లెర్నింగ్(NPTEL) మరియు ఇండి యన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాసు వారు స్వయం అను పేరుతో నిర్వహించిన సర్టిఫికెట్ కోర్స్ ఆన్లైన్ పరిక్షను కళాశాలలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. సి. యువరాజ్ తెలిపారు. ఈ పరీక్షలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు కళాశాల ప్రాంగణం లో నిర్వహించారని, ఈ ఆన్లైన్ పరీక్షకు 3,812 మంది నమోదు చేసుకోగా 3,734 మంది మూడురోజుల పాటు హాజరు అయినట్లు ఆయన అన్నారు. వివిధ సబ్జెక్ట్స్‌లో ఆన్లైన్ పరీక్షలను NPTEL వారు సంవత్సరానికి రెండు సార్లు నిర్వహిస్తారని ఆయన అన్నారు. ఈ పరీక్షలలో ఉతీర్ణులు అయిన విద్యార్థులకు మరియు అధ్యాపకులకు ఆన్లైన్ సర్టిఫికెట్ ను NPTEL వారు అందజేస్తారని, ప్రతి ఏటా తమ విద్యార్థులు మరియు అధ్యాపకులు ఈ పరీక్షలు రాస్తారని ఆయన అన్నారు.

## భగత్ సింగ్ త్యాగం నేటి యువతకు ఆదర్శం

లక్కిరెడ్డిపల్లి మార్చి 23, ప్రభాతవార్త



భారత స్వాతంత్రం కోసం భగత్ సింగ్ చేసిన ప్రాణత్యాగం నేటితరం యువతకు అర్థం కావాలని రాయచోటి సిపిఐ కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం విశ్వ భారతి స్కూల్ నందు 94 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా భగత్ సింగ్ అమర్ రహే అంటూ నినాదాలు ఇచ్చారు. భారత స్వాతంత్రం కోసం భగత్ సింగ్ తో పాటు సుఖదేవ్, రాజా గురు ముగ్గురూ నవ్వుతూ ఉరికంబానెక్కిన గొప్ప స్వాతంత్ర సమరయోధులు అన్నారు. వారి మరణం భారత దేశ ప్రజల్లో ఎంతో స్వాతంత్ర స్ఫూర్తి, చైతన్యం నింపిందన్నారు.నేటి యువత వారి త్యాగాలను తెలుసుకొని సామాజిక బాధ్యతతో, దేశభక్తితో మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకోసం మేధావులు భగత్ సింగ్ చేసిన త్యాగాలను సమాజంలో చాటి చెప్పాలన్నారు. ప్రాథమిక పాఠశాల పాఠ్యపుస్తకాలలో స్ఫూర్తి నింపే భగత్ సింగ్ పాఠ్యాంశం ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి ప్రైవేటీ కరణ ఆపాలి : సిఐటియు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :

ఆర్టీసి ప్రైవేటీకరణను ఆపాలంటూ సిఐటియు జిల్లా నాయకులు హరిశర్మ, ప్రభాకర్‌రెడ్డి, నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్టీసి ప్రాంగణంలో సిఐటియు, అనుబంధ ఎస్‌డబ్ల్యుఎఫ్‌చే ప్రచురించిన కరపత్రాలను ఆవిష్కరించి ఆర్టీసి కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ బస్సుల కొనుగోలు పేరుతో ప్రైవేటు ఓనర్లకు రాయితీలు ఇవ్వడాన్ని ఖండించారు. ప్రజాధనం దుర్వినియోగం అయితే సహించేది లేదన్నారు. సామాన్యులకు ఈ బస్సు చార్జీల వల్ల ఇబ్బందికరంగా ఉందన్నారు. పల్లెవెలుగు బస్సులను పెంచితే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వాస్తవ పరిస్థితులు సమస్యలపై కరపత్రాల్లో ప్రచురించారని కార్మికులు వారిని మెచ్చుకొన్నారు. ఢిల్లీలో సోమవారం జరగనున్న ఆర్టీసి చలో పార్లమెంటు నిరసన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్టీసి కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్రిదీ, జయబాబు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు భగత్‌సింగ్ ఆదర్శప్రాయుడు

మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :

దేశ స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్‌సింగ్ యువతకు, విద్యార్థులకు ఆదర్శప్రాయుడని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, హరినాథ్‌శర్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సర్వేపల్లి నరసింహ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయం నందు భగత్‌సింగ్ 94వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి విద్యార్థి యువతకు భగత్‌సింగ్ పోరాట జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. చిన్నవయస్సులనే పోరాటాలు వైపు ఆకర్షితులై స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ సామ్రాజ్య వాదుల గుండెల్లో గుణపంగా మారి ప్రాణాలను అర్పించారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అప్రిద్, నాయకులు జయబాబు, హకీమ్, హనుమంతునాయక్, ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

## కెసిపి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

### ఎమ్మెల్యే నంద్యాల వరదరాల రెడ్డి



ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 23 ప్రభాతవార్త

కెసి పుల్లయ్య సేవా తత్పరుడని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. శనివారం స్థానిక కొర్రపాడు రోడ్డు లోని కెసి పుల్లయ్య ఎస్టేట్స్ నందు కెసి పుల్లయ్య ఫౌండేషన్ అధినేత కెసి పుల్లయ్య 13వ వర్ధంతిని ఫౌండేషన్ ఛైర్పర్సన్ కె కృష్ణవేణమ్మ, కార్యదర్శి కె అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని కెసి పుల్లయ్యతో ఆయన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కెసి పుల్లయ్య ఫౌండేషన్ తరపున కళారత్న అవార్డు తమిళనాడుకు చెందిన పద్మభూషణ్, పద్మశ్రీ అలార్మెల్ వల్లి, హరితరత్న అవార్డు రాష్ట్రానికి చెందిన వాసిరెడ్డి వంశీకృష్ణ, సేవారత్న అవార్డు రాయలసీమ వాసి యశోద కోట పాటి, విద్యా రత్న అవార్డు తెలంగాణకు చెందిన పెసర భాస్కరరెడ్డి అందజేశారు. వీరితో పాటు 400 మంది పేద విద్యార్థులకు విద్య కోసం సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కల్వ సుజాత, ప్రణవ గ్రూప్ అధినేత బూరుగు రవికుమార్, మాజీ టిటిడి బోర్డు మెంబరు టంగుటూరు మారుతీ ప్రసాద్, ఫౌండేషన్ సీఈఓ సుధా, కెసి పుల్లయ్య కుమారుడు సుశీల్ కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లెలో నిరక్షరాస్యులకు పరీక్షలు



ఉల్లాస్ కార్యక్రమం లో భాగంగా పరీక్షలు రాస్తున్న మహిళలు

తంబళ్లపల్లె మార్చి 23 ప్రభాతవార్త :

మండలంలో ఆదివారం వెలుగు ఏపిఎం గంగాధర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులకు పరీక్షలు నిర్వహించారు. ఉదయం నుండి మండలంలోని 21 పంచాయతీలలో స్థానిక వెలుగు సంఘమిత్రలు, వివో సభ్యులు పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల్లో ముందస్తుగా గుర్తించిన నిరక్షరాస్యులను రప్పించి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు అబ్జర్వర్లుగా వ్యవహరించగా సీసీలు కత్తి నరసింహులు, రమణ, ఆదిలక్ష్మి ల పర్యవేక్షణలో సాఫీగా జరిగాయి. నిరక్షరాస్యులలో వారిలో విద్య పట్ల ఆసక్తి, పఠనాశక్తిని గుర్తించడానికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీసీలు తెలిపారు. పరీక్షల ద్వారా వారి నైపుణ్యాన్ని గుర్తించి తదుపరి వారిలో అక్షర జ్ఞానాన్ని పెంపొందించి 100 అక్షరాస్యత సాధనకు కృషి చేస్తామన్నారు.

### అంబేద్కర్‌ని అవమానించిన వ్యక్తులకు

# కఠిన చర్యలు తీసుకోవాలి

వాల్మీకిపురం మార్చి 23 ప్రభాతవార్త:



నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

వాల్మీపురం పట్టణం అంబేద్కర్ విగ్రహం దగ్గర అంబేద్కర్ విగ్రహంకు పూలమాలవేసి నిరసన తెలపడం అయినది ఈ కార్యక్రమం మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో జరిగినది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు చింతపర్తి శివయ్య హాజరవడం జరిగినది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రెండు రోజుల ముందు తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలో అంబేద్కర్ విగ్రహంకు చెప్పులు దండ వేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరడమైనది ఇప్పటికీ ఎన్నో చోట్ల విగ్రహాలు ధ్వంసం చేయడం చెప్పులదండ వేసే అవమానించడం జరుగుతూనే ఉన్నది ఇంతవరకు వారి పైన ఎవరి పైన చర్యలేదు అలా చేసిన వారిని కఠినంగా శిక్షిస్తే ఇలాంటి దురదృష్టంలో పునరావతం కావని అంబేద్కర్ విగ్రహాల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రక్షణ కల్పించాలని మాల మహానాడు డిమాండ్ చేయడం జరిగినది. ప్రభుత్వాలు కూడా గత ప్రభుత్వమైన ఇప్పటి ప్రభుత్వమైన మాలలకు అన్యాయం చేస్తున్నారని ఏ ప్రభుత్వానికైనా వెన్నుదండుగా ఉండేది మాలలే అని గుర్తించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు బివి రమణ, జిల్లా ఉమ్మడి ఉపాధ్యక్షులు వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి గాంధీ పేట రఘు, మండల అధ్యక్షులు నాగార్జున, యూత్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు మహేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నాని, మండల నాయకులు వెంకట ముని, కుప్ప స్వామి, రమణయ్య, సహదేవ, తారక, శ్యామ్‌సుందర్, భాస్కర పాల్గొన్నారు.

## ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు

వాల్మీకిపురం, మార్చి 23 ప్రభాతవార్త :



భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసిన దృశ్యం

స్వాతంత్ర్య సమర యోధుడు, విప్లవ వీరుడు మన భగత్ సింగ్ అని జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభు చరణ్ అన్నారు. ఆదివారం భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో స్థానిక ఉర్దూ మైనార్టీ బాలికల పాఠశాలలో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థుల సమావేశాన్ని ఉద్దేశించి ప్రభుచరణ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ముగ్గురు యువకులైన భగత్సింగ్, రాజ్గురు, సుఖ్దేలు ప్రాణాలర్పించిన మార్చి 23వ తేదిని అమరవీరుల దినంగా భారతదేశం పాటిస్తుందన్నారు. మార్చి 23, 1931న బ్రిటీష్ వారు పాకిస్థాన్లోని లాహోర్ సెంట్రల్ జైలులో ముగ్గురిని ఉరితీశారన్నారు. భగత్సాంగ్ (23), సుక్దేవ్(24), రాజ్గురు(23)లు అమరులై పౌరుషానికి, త్యాగానికి, స్వాతంత్ర్యేచ్ఛకు ప్రతీకగా ప్రజల గుండెల్లో ఈనాటికి నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవమల్లిక, ఉపాధ్యాయులు సోఫియాబేగం, నర్మద, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెదేపా లో చేరిన వైఎస్ఆర్సీపీ నాయకులు

పులివెందుల రూరల్, మార్చి 23, ప్రభాతవార్త :

సింహాద్రిపురం మండలంలోని అంకాలమ్మగూడురుకు చెందిన వైఎస్ఆర్సీపీ నాయకులు ఆదివారం పులివెందుల నియోజకవర్గ తెదేపా ఇంచార్జి బి.టెక్ రవి సమక్షంలో తెదేపా లో చేరారు. వైసీపీ నాయకుడు వెలుగోటి బాబు రెడ్డి అతని అనుచర వర్గం అంతా తెలుగుదేశం పార్టీలో చేరగా, వారికి బి.టెక్ రవి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అంతకు ముందు గ్రామానికి వచ్చిన బి.టెక్ రవికి స్థానికులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన అంకాలమ్మ తల్లి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం లో పులివెందుల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బ్యాడ్మింటన్ (మహిళా విభాగం) ఛాంపియన్ టి.హోత్రిశ్రీ

**పీలేరు, మార్చి 23 ప్రభాతవార్త:**
జేఎన్టీయూఏ అనంతపురం ఆధ్వర్యంలో జేఎన్టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కలికిరి లో జరిగిన 12వ ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ మీట్2025 లో టి.హోత్రిశ్రీ సింగిల్స్ మరియు డబుల్స్ (మహిళా విభాగం) లో అద్భుతమైన ఆటను ప్రదర్శించి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌గా నిలిచింది. పీలేరు పట్టణానికి చెందిన టి. హోత్రిశ్రీ, ప్రస్తుతం తిరుపతి కె.ఎం.ఎం ఇంజనీరింగ్ కాలేజీలో బి.టెక్ రెండవ సంవత్సరం (ఈ.సి.ఈ) చదువుతోంది. ఈ పోటీల్లో ఆమె సింగిల్స్ మరియు డబుల్స్ విభాగాల్లో ప్రత్యర్థులపై అలవోకగా విజయం సాధించింది. సింగిల్స్ ఫైనల్‌లో, జేఎన్టీయూఏ అనంతపూర్ విద్యార్థిని గ్రేసీను ఎదుర్కొన్న హోత్రిశ్రీ, 309 పాయింట్ల తేడాతో గెలిచి టైటిల్‌ను దక్కించుకుంది. డబుల్స్ విభాగంలో, తన జోడి గురుపూజిత తో కలిసి గౌతమీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ప్రొద్దుటూరు విద్యార్థినులు మోక్షితవైష్ణవి జంటను 3016 పాయింట్ల తేడాతో ఓడించి డబుల్స్ ఛాంపియన్‌షిప్ ను సొంతం చేసుకుంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని జేఎన్టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కలికిరి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు ఆమెకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా హోత్రిశ్రీ మాట్లాడుతూ "నా తండ్రి టి.ప్రభాకర్ రెడ్డి బ్యాడ్మింటన్



ట్రోఫీ ని అందుకుంటున్న హోత్రి శ్రీ

నేషనల్ ప్లేయర్, నాకు కేవలం కోచ్ మాత్రమే కాదు, నిజమైన ఫిలాసఫర్ కూడా. ఆయన మార్గదర్శకత్వం వల్లనే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. నా తదుపరి లక్ష్యం అంతర్జాతీయ స్థాయిలో రాణించడం." అని తెలిపింది. హోత్రిశ్రీ విజయాన్ని పురస్కరించుకుని, కుటుంబసభ్యులు, స్నేహితులు, సహచర విద్యార్థులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

# మాచుపల్లి గంగమ్మ జాతరలో కూటమి నేతలు

**సిద్దవటం, మార్చి 23, ప్రభాతవార్త:**
మండలంలోని మాచుపల్లి గ్రామం గంగమ్మ జాతర మహోత్సవ వేడుకల్లో రాజంపేట నియోజకవర్గ కూటమి నేతలు జనసేన పార్టీ పార్లమెంటు సమన్వయకర్త అతికారి కృష్ణ, అన్నమయ్య జిల్లా తెదేపా అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు అతికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి కూటమి నేతలు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్ రాజు మాట్లాడుతూ మాచుపల్లె, జ్యోతి వంతెన నిర్మాణం అధిష్టానం పరిశీలనలో ఉందని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం అమలు చేస్తామన్నారు. పార్లమెంటు సమన్వయకర్త కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల హామీలో ఇచ్చిన వాగ్దానం ప్రతి ఒక్కటి అమలు పరచడానికి రాష్ట్ర ప్రభుత్వ



సుముఖంగా ఉందని వైసీపీ ప్రభుత్వంలో మండలం సుముఖంగా ఉందని వైసీపీ ప్రభుత్వంలో మండలం ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు మాజీ మార్కెట్ ఛైర్మన్ జవహర్ బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సర్పంచ్ ప్రతాప్ నాయుడు, గజ్జలబాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాల తొలగింపులో చోటు చేసుకున్న ఉద్రిక్తత





రైల్వే గేట్ సమీపంలోని ఇళ్ల యజమానులతో మాట్లాడుతున్న తహశీల్దారు

## గడువు ఇచ్చిన తహశీల్దారు భీమేశ్వరరావు

**పీలేరు మార్చి 23 ప్రభాతవార్త:**
పీలేరు పట్టణం, ఎల్.బి.ఎస్ రోడ్డులోని రైల్వే గేట్ సమీపంలో ఆర్ఓబి నిర్మాణం చేపట్టారు. గేటు సమీపంలో ఇరువైపులా ఉన్న పక్కా నిర్మాణాలను తొలగించడానికి అధికారులు ఆదివారం ప్రయత్నించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. రోడ్డుకు ఇరువైపులా నిర్మాణాలను తొలగించి, రైల్వే గేట్ మార్చాలని ప్రతిపాదించారు. నిర్మాణాల తొలగింపుకు మూడు నెలల క్రితమే జాతీయ రహదారుల శాఖ, రెవెన్యూ శాఖ గేటుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలను కొలతలు వేసి ఏ మేరకు నిర్మాణాలు తొలగించాల్సి వస్తుందన్న విషయాన్ని ఆయా ఇండ్ల యజమానులకు తెలియజేశారు. అయితే గేటుకు ఓ వైపున ఉన్న కొందరి నిర్మాణాలకు సంబంధించి నష్ట పరిహారం చెల్లించేందుకు, సర్వేయర్ కొలతలు తీసి ఆ నివేదిక ఆధారంగా పరిహారం దస్త్రాలను సిద్ధం చేసి, రాయచోటి ఆర్డిఓ కార్యాలయానికి పంపారు. మరోవైపున ఉన్న నిర్మాణాలను మాత్రం పరిహారం కోసం ప్రతిపాదనలు పంపనందున వాటి యజమానులు తొలగింపు విషయంలో పద్ధతిగా ఉండిపోయారు. అయితే స్థానికంగా జాతీయ రహదారి పనులు చేయిస్తున్న సిబ్బంది మాత్రం నిర్మాణాలు తొలగించాల్సి వస్తుందని వారికి అప్పుడప్పుడు హెచ్చరిస్తూనే వచ్చారు. కానీ ఏ మాత్రం తొలగించాలన్న విషయాన్ని స్పష్టం చేయకుండానే తొలగించాలంటే ఎలా అని స్థానికులు వారిని ప్రశ్నించారు. అయితే ఆదివారం తహశీల్దారు భీమేశ్వరరావు, ఎస్సై బాలకృష్ణ, తమ సిబ్బందితో ఒక్కసారిగా వచ్చి నిర్మాణాలను తొలగించడానికి యంత్రాలు ఉపయోగించడంతో అక్కడ కొంతమేర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముందుగా నోటీసులు ఇవ్వకుండా తొలగించాలంటే ఇబ్బంది అవుతుందని బాధితులందరూ కోరడంతో తహశీల్దారు నిర్మాణాల తొలగింపుకు మరో నాలుగు రోజులు గడువు ఇచ్చి వెళ్లారు. దీంతో పరిస్థితి కొంత సద్దుమణిగింది. బాధితులు మాట్లాడుతూ తొలగింపు గడువుతో పాటు పరిహారం కూడా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

# అలరించిన సాంస్కృతిక నృత్యాలు

**కడప కార్పొరేషన్ మార్చి 23 ప్రభాతవార్త:**
కడప శిల్పారామంలో శనివారం సాంస్కృతిక కళావేదిక మీద వారాంతపు ఆట విడుపులో భాగంగా మిస్సా మూవీ వారి సహకారంతో కడప నగరానికి చెందిన జి ఆర్‌టిజివికె ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులచే అబ్బురుపరిచే



శాస్త్రీయ నృత్యాలు, పల్లె జానపద, సినీ నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. గూవాగోరింకా, గోదావరి గట్టు మీద రామ చిలీకవే, మేమెఇండియన్, గోబీయాలో గోబీయాలో వంటి పాటలకు స్టెప్స్ వేశారు. ఎమ్మెల్సీ ఎంవి రామచంద్ర రెడ్డి, టీటీడీ బోర్డు మెంబెర్, సుగవాసి ప్రసాద్ బాబు, బిజెపి స్టేట్ సెక్రెటరీ, నగోతు రమేష్ నాయుడు, శిల్పారామం పరిపాలన అధికారి ఎం శ్రీనివాసులు, ఓ ఎస్ డి ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ కృష్ణ ప్రసాద్, ఫీల్డ్ సూపర్వైజరర్ పి.మధుసూదన్ బాబు, స్కూల్ కరస్పాండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

# శిల్పారామం ఏవోగా కృష్ణ ప్రసాద్

**కడప కార్పొరేషన్ మార్చి 23 ప్రభాత వార్త:**
కడప శిల్పారామం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా యస్. కృష్ణప్రసాద్ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా నుంచి కడపకు వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కడప శిల్పారామం అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానన్నారు.



# సునీత విలియమ్స్ భూమిని చేరడం అభినందనీయం

**బద్వేల్ అర్బన్, మార్చి 23, ప్రభాతవార్త**
భారత సంతతికి చెందిన సునీత విలియమ్స్ సురక్షితముగా తిరిగి భూమి పైకి వచ్చినందుకు అభినందనలు తెలుపుతూ యోగి వేమన యూనివర్సిటీ కార్యవర్గ సభ్యులు కొండపల్లి చిన్న సుబ్బారావు అభినందనలు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ సునీత విలియమ్స్ 1965 సెప్టెంబర్ 19 వ తేదీన ప్రేమించారని ,భారత సంతతికి చెందిన ఆమె చిన్నప్పటి నుంచి విద్య పట్ల ఆసక్తి కలిగి మొదటగా జంతువుల పట్ల ప్రేమ కలిగి వెటర్నరీ డాక్టర్ కావాలని అనుకొని తన అభిప్రాయాన్ని మార్చుకొని సైన్యములో హెలికాప్టర్ పైలెట్గా శిక్షణ తీసుకొని నాసా వ్యోమగామి 14వ అంతరిక్ష వ్యోమ గాములలో ఒకరిగా చేరి కమాండర్ గా బాధ్యతలు స్వీకరించి తొమ్మిది రోజులలో తిరిగి రావలసిన సునీత విలియమ్స్ 286 రోజులుగా తొమ్మిది నెలలు అంతరిక్షంలో అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంలో తాను జీవించి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. శాస్త్ర పరిశోధనల కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి భవిష్యత్ తరాల కోసం బాటలు వేసిన సునీత విలియమ్స్ మూడ వసారి కూడా సురక్షితంగా భూమి పైకి రాగలిగారని, అంతరిక్షంలో అనేక పరిశోధనలు చేసి అత్యంత ఎక్కువ సేపు స్పేస్ లో విహరించి అరుదైన రికార్డును తన సొంతం చేసుకున్నదన్నారు. సంపూర్ణ ఆరోగ్యముతో రావడం మనందరికీ సంతోషకరం అని తెలియజేశా రు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి లు నానబాల వెంకటేశ్వర్లు, బద్వేల్ గురుమూర్తి ,బద్వేల్ పట్టణ ఆర్య వైశ్య సంఘ అధ్యక్షులు సుబ్బారావు, ఆవాజ్ కమిటీ జిల్లా కార్యవర్గ సభ్యులు అన్వర్ భాషా ,బద్వేల్ అభివృద్ధి కమిటీ కోశాధికారి పాలేటి శ్రీనివాసులు రెడ్డి ,దళిత నాయకుడుచిన్నయ్య, ఓ ఎస్ వి ప్రసాద్ ,బాలయ్య, నాగార్జున తదితరులు పాల్గొన్నారు



# పూరిళ్లు దగ్ధం - వ్యక్తి దుర్మరణం

**సిద్దవటం, మార్చి 23, ప్రభాతవార్త:**
మూలపల్లి గ్రామంలో పూరిళ్లు దగ్ధం కావడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. గ్రామస్థులు చెప్పిన కథనం ప్రకారం గ్రామంలో ఉన్న సత్రం వద్ద ఆదివారం ఉదయం పూరిళ్లు దగ్ధం కావడంతో వృద్ధుడు మంటల్లో చిక్కుకొని అగ్నికి ఆహుతి అయిపోయాడు. అతను కొన్ని సంవత్సరాల నుంచి గ్రామంలో ఉంటున్నాడని తెలిపారు. ఆ ప్రాంతాన్ని ఒంటిమిట్ట సీఐ బాబు పరి శీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూ లపల్లె గ్రామంలో ఒక పూరిళ్లు దగ్ధం కావడంతో వయోవృద్ధుడు పిల్లి రాజారెడ్డి(75)కి కంటి చూపు సరిగా లేదని ఇంట్లో అతను అన్నం చేస్తూ ఉండగా మంటలు చెలరేగి మృతి చెందాడని జరిగిన ఘటనపై విచారిస్తు న్నామన్నారు.

# విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజల భద్రతకు భరోసా

**కడప మార్చి 23, ప్రభాతవార్త:**
విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని జిల్లా పోలీసులకు కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లాలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను విచారించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్ల డ్రైవర్లు సీటు బెల్టు వేసుకోవాలన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగులకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని సూచించారు. రహదారి భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు చేపట్టారు.



# నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

**కడప మార్చి 23, ప్రభాతవార్త:**
ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం పిజిఆర్ఎస్ హాలులో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణంగా సభాభవన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని, ఆ రహదారి కొత్తగా నిర్మించబడుతున్న కారణంగా, ఈ సోమవారం పి.జి.ఆర్.ఎస్ హాలులో నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

# అకాల వర్షానికి దెబ్బ తిన్న అరటి తోట

**పులివెందుల రూరల్, మార్చి 23, ప్రభాతవార్త :**
లింగాల మండలం తాతిరెడ్డి పల్లె, రామన్నూతలపల్లి, కొమన్నూతల తదితర గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన ఆకాల వడగాలులు, వర్షానికి దెబ్బ తిన్న అరటి తోటలను లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ విశ్వనాథ రెడ్డి, లింగాల మండల టీడీపీ సీనియర్ నేత దేవిరెడ్డి సంజీవ రెడ్డి, టీడీపి నాయకులు కార్యకర్తలతో కలిసి ఆదివారం పులివెందుల టీడీపి ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బిటెక్ రవి) పరిశీలించారు. రైతుల



ను అన్ని విధాలా ఆదుకుంమని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందజేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అధికారుల నివేదిక ప్రకారం పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల రైతులు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా ముగిసిన గంగమ్మ తిరుణాల..



**సుండుపల్లి, మార్చి 23, ప్రభాతవార్త:**
మండల సమీపంలోని బండ కాడ ఈడిగపల్లి లో వెలసిన గంగమ్మ అమ్మ వారి తిరుణాల ఆదివారం ఉదయం తో ఘనంగా ముగిసింది.తిరుణాల ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి రాత్రి చెక్కభజనలు నిర్వహించారు. అనంతరం రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ, మేల తాళాలు డప్పు వాయిద్యాల మధ్య బాణాసంచా కాలుస్తూ చాందిని బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఆదివారం ఉదయం భక్తులు తమ మొక్కుబడులలో భాగంగా బోనాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. తిరుణాల మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు.

# మెగా అభిమానుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**ప్రొద్దుటూరు మార్చి 23 ప్రభాతవార్త**
గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్ జన్మదిన వారోత్సవాల సందర్భంగా స్థానిక ప్రొద్దటూరు జిల్లా ఆస్పత్రిలో మెగా అభిమానుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. 23 తేదీన ఉదయం 10:00 గంటలకి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ మెడికల్ ఆఫీసర్ గోపాల్ మాట్లాడుతూ చిరంజీవి తనయుడు రామ్ చరణ్ తేజ్ పుట్టినరోజు వారోత్సవాలలో భాగంగా రక్తదాన కార్యక్రమం చేయడం అభినందనీయం అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం మెగా అభిమానులకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు రామారావు షరీఫ్ మధు చిరు రాయల్, బియ్యం కేశవ, ప్రవీణ్, చోటు, చిన్న, సుబ్బారెడ్డి, పల్లా రఘు, రాము ,జాన్, చోటు, నాగేంద్ర, ఖాదర్ బాద్ శంకర్, నామతుల్లా, బాబురావు లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**దువ్వూరు, మార్చి 23, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కడప-కర్నూల్ జాతియ రహదారిపై టంగుటూరు మెట్ట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లెల్ల గ్రామానికి చెందిన తలారి దానమయ్య(46) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లెల్ల గ్రామానికి చెందిన దానమయ్య తన పనుల నిమిత్తం చాగలమర్రికి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా దువ్వూరు నుంచి



చాగమర్రి పోవు కారు టంగుటూరు మెట్ట వద్ద అతి వేగంగా ఢీకొంది. దీంతో దానమయ్య కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని దువ్వూరు ఎస్ఐ వినోద్‌కుమార్ పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

**దువ్వూరు, మార్చి 23, ప్రభాతవార్త:**
రేషన్ కార్డులలోని సభ్యులందరు సభ్యులందరిచే ఈకేవైసీ పూర్తి చేయించాలని తహసీల్దార్ అక్బర్ బాషా అన్నారు. ఈకేవైసీ కార్యక్రమాన్ని ఈ నెల 31వ తేది లోపల పూర్తిచేయాలన్నారు. రేషన్ లబ్ధిదారులకు ఇదివరకే డీలర్లు ఈకేవైసి చేశారని ఇంకా మిగిలిన కొందరికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రేషన్ షాపుల వారిగా లబ్ధిదారుల జాబితా డీలర్ల వద్ద ఉంచామని అక్కడికి వెళ్లి ఎండీయూలు, రేషన్ డీలర్లు సంయుక్తంగా ఈ నెల 30లోపల పూర్తి చేయాలన్నారు. ఈకేవైసీ చేసుకోని సభ్యులకు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని అలాగే రేషన్ కూడ నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ఈకేవైసీ పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు.

# దుండగులను కఠినంగా శిక్షించాలి



**బద్వేలు, మార్చి 23, ప్రభాతవార్త**
తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దుబచర్లలోని గాంధీ కాలనీలో భారతరత్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండలు వేసి అవమానించిన దుండగులను కఠినంగా శిక్షించాలని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నాడు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ దేశాల సైతం అంబేద్కర్‌ని కొనియాడుతూ ఉంటే శత్రు దేశమైన చైనా పాకిస్తాన్ ఆయన సేవలను కొనియాడుతూ ఉంటే ఆయన రాసిన రాజ్యాంగాన్ని ఉపయోగించుకొని స్వేచ్ఛగా జీవిస్తున్న ఈ దేశంలో ఆయనను అవమానపరచడం క్షమించరాని నేరమని అలాంటి దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఏరియా కమిటీ సభ్యుడు సి నారాయణ సంఘమిత్ర జిల్లా అధ్యక్షుడు సొద్దల పెంచలయ్య, దళిత సీనియర్ నాయకులు కేశవయ్య కూకట్పల్లి మురళి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడిగే వెంకటరమణ, దళిత వేదిక జిల్లా కన్వీనర్ ఓబులేష్, ఓ ఎస్ వి ప్రసాద్, మాల మహానాడు నాయకులు సుబ్బరాయుడు రామయ్య తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా పెద్దమ్మ తల్లి దేవర

**మైదుకూరు, మార్చి 23, ప్రభాతవార్త:**
పట్టణంలో శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మతల్లి దేవర శుక్రవారంతో మొదలుకొని ఆదివారం పెద్దమ్మతల్లి దేవర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి పెద్దమ్మతల్లి విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి మహిళలు బోనాలు, కాయాకర్పూరంతో పాటు పెద్దమ్మతల్లికి కోళ్లు, మేకపోతులు, పొట్టేళ్లు, దున్న పోతులను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి బలి సమర్పించారు.అనంతరం మహిళలు



టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మైదుకూరు పట్టణ ప్రముఖులు, అమ్మవారి భక్తులు కుటుంబ సభ్యులతో దేవర మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.దేవర సందర్భంగా పట్టణంలో బంధువర్గాలతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమాన్ని ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

## ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవిస్తున్న దృశ్యం

**మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :**
ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసం వద్ద నియోజకవర్గ పరిధిలోని ప్రజలు పలు సమస్యలపైన అర్జీల రూపంలో విన్నవించారు. ముఖ్యంగా రోడ్లు, మురుగునీటి కాలువలు, పెన్షన్లు, నీటిసౌకర్యం, ఇంటి స్థలాల విషయం పై విన్నవించుకొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజలు ఇచ్చిన సమస్యల పట్ల అధికారులతో మాట్లాడుతూ పరిష్కరించాల్సిందిగా కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా గ్రామాల్లో రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి ఇప్పటికే అధిక మొత్తంలో నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. పల్లె పండగ పేరుతో ప్రతి గ్రామంలోనూ సిసిరోడ్లు వేయడం జరిగిందన్నారు. ప్రజాసంక్షేమమే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్‌లు నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడం జరుగుతుందన్నారు. టౌన్‌బ్యాంకుఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, పార్లమెంటరీ అధికారి ఆర్‌జె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ దేవత ఆలయంకి తరలి వచ్చిన వేలాది మంది భక్తులు

## భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు

**లక్కిరెడ్డిపల్లె మార్చి 23 ప్రభాత భర్త**
మండలంలోని శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ తల్లికి ఆలయానికి వేలాది మంది భక్తులు ఆదివారం బోనాలు తల నీలాలు అర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. జాతర ముగిసిన తర్వాత మూడోవ ఆదివారం కావడంతో గ్రామ బోనాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు ఆలయంకి తరలి రావడంతో అమ్మవారి



దర్శనం కోసం తెల్లవారుజాము నుండే క్యూలైన్లో భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. లక్కిరెడ్డిపల్లె పోలీసులుతో పాటు ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఆలయ పూజారులు చెల్లు గంగరాజు, దినేష్ యాదవ్, రామచంద్ర, వెంకటేష్ గురుస్వామి, రెడ్డి శేఖర్, బోస్ యాదవ్, సాయిలు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించే విధంగా చొరవ చూపుతూ అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.ఆలయ ప్రాంగణం చుట్టూ శీతల పానీయాలు అంగళ్లు, మిఠాయి కొట్టులు, అత్యధికంగా చెరుకుల బండ్లు ఆలయం ప్రాంగణంకి చేరుకోవడంతో చిన్న పాటి జాతరను తలపించింది.ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో భక్తులకు చలువ పందిళ్ల ఏర్పాటు చేసారు..ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# ప్రతి ప్రైవేటు ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం వీల్లేదు

## (సుప్రీం కోర్టు స్పష్టీకరణ)

**బద్వేలు లీగల్, మార్చి 23 ప్రభాతవార్త :**
ప్రతి ప్రైవేటు ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి వీల్లేదని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. 1978 సంవత్సరంలో సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును 9 మంది సభ్యులతో కూడిన ధర్మాసనం త్రోసి పుచ్చింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం 7:2 మెజార్టీతో తీర్పును వెలువరించింది. సుప్రీం కోర్టు ధర్మాసనం తన తీర్పులో ప్రతి ప్రైవేటు ఆస్తి సమాజ ఆస్తిగా పరిగణించలేమని, నిర్దిష్ట ఆస్తులను మాత్రమే ప్రభుత్వం సమాజ వనరులుగా పరిగణించి ఉమ్మడి ప్రయోజనాల కోసం ఉపయోగించాలని పేర్కొంది. లభ్యత, కొరత, సమాజ వనరులపై దాని ప్రభావం తదితరాలన్నీ పరిగణనలోనికి తీసుకోవాలని కూడా తెలిపింది. ప్రైవేటు యాజమాన్యంలోని ఆస్తిని రాష్ట్ర ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవచ్చని 1978 సంవత్సరంలో జస్టిస్ కృష్ణ అయ్యర్ ఇచ్చిన తీర్పును ధర్మాసనం త్రోసి పుచ్చింది. అప్పటి కాలమాన పరిస్థితుల ఆధారంగా ఆ తీర్పు వెలువడిందని అభిప్రాయపడింది. సాధారణంగా 9 మంది న్యాయమూర్తుల బెంచి ఉండటం చాలా అరుదు. ఇప్పటి వరకూ 17 కేసుల్లో మాత్రమే అలా జరిగింది. రాజ్యాంగ పరంగా ప్రాముఖ్యత కలిగిన విషయాలను నిర్ణయించడానికి ఇటువంటివి ఏర్పాటు చేస్తారు అంటూ సుప్రీం కోర్టు తన తీర్పును వెలువరించింది.

# ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

**పులివెందుల రూరల్, మార్చి 23, ప్రభాతవార్త :**
పులివెందుల లోని శిల్పారామం లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ధర్మవరానికి చెందిన మానసా కళాకేంద్రం నాట్యాచార్యులు డాక్టర్ ఆర్. మానస, చందు డ్యాన్స్ స్టూడియో చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహా గణపతిం అంటూ సాగే ఈ పాటతో మొదలై నమో నమో నమ శివాయ, ఆయుధ పూజ కంగువ, ఆ కుర్చీని మడత పెట్టి, రాధిక రాధిక రాధిక రాధిక... తదితెర పాటలకు కళాకారులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ప్రేక్షకుల చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమం ఏర్పాట్లను శిల్పారామం ఫీల్డ్ సూపర్ వైజర్ ఇస్మాయిల్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాస్టర్ తీ. చంద్ర శేఖర, ఫీల్డ్ సూపర్ వైజర్ ఇస్మాయిల్ సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

